


ప్రజావీక్షణం
దినపత్రిక
ఎడిటర్ : కె. శ్రావన్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవి
Subscribe

www.prajaveekshanam.in | సంపుటి:16 | సంచిక :288 | 11 శుక్రవారం సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari

# ఉద్యోగులకు గుడ్‌న్యూస్...



డీఏలపై సీఎం రేవంత్ కీలక హామీ...

- ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డితో జేఏసీ చర్చలు
- ఆరు డీఏలు త్వరలో ప్రకటిస్తామని సీఎం హామీ
- పీఆర్సీ నివేదికను వెంటనే అందేలా చర్యలు
- ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులను తెలియజేసిన నేతలు
- ఉద్యోగుల పక్షాన ఉంటానని సీఎం హామీ

ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వ ఆహ్వానం మేరకు సీఎంను కలిసి తమ సమస్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న పని ఒత్తిడిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులకు జరుగుతున్న ఆర్థిక నష్టాన్ని వివరించారు.పీఆర్సీ కమిటీ నివేదిక ఆలస్యం కావడంతో ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను కూడా జేఏసీ నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ సంఘాల నాయకులపై పెరుగుతున్న ఒత్తిడి గురించి కూడా వివరించారు. సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన సీఎం.. తాను ఎప్పుడూ ఉద్యోగుల పక్షానే ఉంటానని హామీ ఇచ్చినట్లు 'తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్' (టీఆర్ఈఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె. గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి తెలిపారు.ఆరు డీఏలపై త్వరలోనే ప్రకటన చేస్తామని సీఎం చెప్పినట్లు వారు వెల్లడించారు. పీఆర్సీ కమిటీ నివేదిక కూడా వెంటనే తనకు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని సీఎం స్పష్టం చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.సీఎం సానుకూలంగా స్పందించి హామీలు ఇవ్వడంపై టీఆర్ఈఎస్ఏ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని నేతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో టీఆర్ఈఎస్ఏ గౌరవాధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి ఉన్నారు. ...మిగతా 2 లో...

## డీకే శివకుమార్ పాలనకు 100 రోజులు..
# సిద్ధరామయ్య ఏమన్నారంటే...!

- ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రభుత్వం సరైన దిశలోనే వెళుతోందన్న సిద్ధరామయ్య
- 100 రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా సీఎం, కేబినెట్‌కు అభినందనలు
- ఏడాదికి రూ.52,000 కోట్లతో ఐదు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని వెల్లడి
- బీజేపీ బళ్లారి పాదయాత్రను ఒక రాజకీయ జిమ్మిక్కుగా అభివర్ణన
- కరువు సాయం కోసం కేంద్రంపై ఆధారపడొద్దని ప్రభుత్వానికి సూచన



కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం సరైన దిశలోనే పయనిస్తోందని మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. ...మిగతా 2 లో...

## సాక్షాత్తు సీఎం సొంత ఊరిలోనే ఈ దుస్థితా..?

- విద్యుత్ రంగాన్ని కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందన్న కేటీఆర్
- పాతకాలపు కరెంట్ కోతలు పునరావృతమవుతున్నాయని విమర్శ
- రేవంత్ సొంత గ్రామంలోనే రైతులు విద్యుత్ కోతలతో అల్లాడుతున్నారన్న కేటీఆర్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేసిందని... కేసీఆర్ హయాంలో లభించిన 24 గంటల నాణ్య మైన ఉచిత విద్యుత్ స్థానంలో మళ్లీ పాత కాలపు కరెంటు కోతలు పునరావృ తమవు తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు.

...మిగతా 2 లో...

# ప్రియాంక గాంధీ ఫేక్ వీడియోలు..

### వాటిలో పెట్టుబడులు పెట్టొద్దంటూ ఆఫీస్ హెచ్చరిక

- ఏఐ టెక్నాలజీతో ప్రియాంక గాంధీ ఫేక్ వీడియోల సృష్టి
- కొన్ని పథకాలలో పెట్టుబడులు పెట్టాలంటూ మోసపూరిత ప్రచారం
- ఇవి పూర్తిగా నకిలీవని స్పష్టం చేసిన ఆమె కార్యాలయం
- వీటిని నమ్మి డబ్బులు పెట్టవద్దని ప్రజలకు హెచ్చరిక
- అనుమానాస్పద పోస్టులను రిపోర్ట్ చేయాలని విజ్ఞప్తి

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా పేరుతో సామాజిక మాధ్యమాల్లో కొన్ని నకిలీ వీడియోలు విస్తృతంగా ప్రచార మవుతున్నాయి. ఈ పరిణామంపై ఆమె కార్యాలయం తీవ్రంగా స్పందిస్తూ ప్రజలకు హెచ్చరిక జారీ చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించిన ఈ వీడియోలను చూసి మోసపోవద్దని స్పష్టం చేసింది. ...మిగతా 2 లో...





## తుమ్మల నాగేశ్వరరావు పనితీరు, వ్యక్తిత్వంపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు

- ఇతర పార్టీల వారికి కూడా మంచి చేసే నాయకుడు తుమ్మల అన్న పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి
- తుమ్మల అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారని ప్రశంస
- ఏ సమస్యపై ఫోన్ చేసినా వెంటనే స్పందిస్తారని కితాబు

కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా సేవలు అందిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు పనితీరుపై బీజేపీ శాసనసభ్యులు పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. పార్టీలు వేరైనా ప్రజలకు మంచి చేసే నాయకుడిని, వారి నిబద్ధతను గుర్తించి మెచ్చుకోవడంలో తప్పులేదని వారు స్పష్టం చేశారు. "మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తు న్నారు.

...మిగతా 2 లో...

## తమిళనాడులో రాష్ట్ర పార్టీగా టీవీకే.. విజయ్ పార్టీకి
# ఈసీ అధికారిక గుర్తింపు...

- తమిళగ వెట్రి కళగంకు రాష్ట్ర పార్టీ హోదా కల్పించిన ఈసీ
- విజయ్ పార్టీకి శాశ్వత గుర్తుగా 'విజిల్' కేటాయింపు
- 2026 అసెంబ్లీ ఎన్నికల్లో 108 సీట్లు గెలిచిన టీవీకే
- తొలి ఎన్నికల్లోనే 34.92 శాతం ఓట్లు సాధించిన పార్టీ
- తమిళనాడులో ఏడో రాష్ట్ర పార్టీగా అవతరించిన టీవీకే



ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీకి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) రాష్ట్ర పార్టీగా అధికారిక గుర్తింపునిచ్చింది. పార్టీకి శాశ్వత ఎన్నికల గుర్తుగా 'విజిల్'ను కేటాయిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే కనబరిచిన అద్భుత పనితీరు ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. ...మిగతా 2 లో...



## రూ. 200 కోట్ల భూమిని రేవంత్ రెడ్డి ఆయన సోదరుడికి కట్టబెట్టాడు: కేటీఆర్

- రేవంత్ రెడ్డి తన 18 గంటల సమయాన్ని ఆయన సోదరుల కోసం కేటాయిస్తున్నారన్న కేటీఆర్
- లక్ష మూలధనం ఉన్న కంపెనీకి రూ. 200 కోట్ల భూమిని కట్టబెట్టారని ఆరోపణ
- ఈ భూ కుంభకోణంపై ఈడీ, సీబీఐలతో కేంద్రం విచారణ జరిపించాలని డిమాండ్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోదరుడు కొండల్ రెడ్డికి చెందిన షెల్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కట్టబెట్టారని, ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వరుసగా సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు.

...మిగతా 2 లో...

## ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది

- రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్న భట్టి
- ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల కోసం శ్రీశైలం, సాగర్ తదితర రిజర్వాయర్లను పరిశీలిస్తున్నామని వెల్లడి
- విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు చేరిందన్న డిప్యూటీ సీఎం

తెలంగాణలో పునరుత్పాదక శక్తి (రెన్యువబుల్ ఎనర్జీ) రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, అందులో భాగంగా రిజర్వాయర్లపై 'ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ల' ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. ...మిగతా 2 లో...



## కేటీఆర్, హరీశ్ రావుపై లైంగిక వేధింపుల కేసు

- మహిళా పోలీసులతో దురుసు ప్రవర్తన ఆరోపణలపై బీఆర్ఎస్ నేతలపై లైంగిక వేధింపుల కేసు
- కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై ఎఫ్ఐఆర్
- అసెంబ్లీ వద్ద చొక్కాలు విప్పి ఇబ్బంది పెట్టారని మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు
- భారతీయ న్యాయ సంహిత కింద కేసు నమోదు చేసిన సైఫాబాద్ పోలీసులు

తెలంగాణ అసెంబ్లీ వద్ద విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు సహా నలుగురు నేతలపై పోలీసులు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. ఓ మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.వివరాల్లోకి వెళితే.. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గేట్ నెం.3 వద్ద మహిళా కానిస్టేబుళ్లు భద్రతా విధుల్లో ఉన్నారు. ఆ సమయంలో రాజకీయ నినాదాలున్న నల్ల టీ-షర్టులు ధరించి, ప్లకార్డులతో కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలు అక్కడికి చేరుకున్నారు. ...మిగతా 2 లో...

# ప్రియాంక గాంధీ ఫేక్ వీడియోలు.. వాటిలో పెట్టుబడులు పెట్టొద్దంటూ ఆఫీస్ హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా పేరుతో సామాజిక మాధ్యమాల్లో కొన్ని నకిలీ వీడియోలు విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. ఈ పరిణామంపై ఆమె కార్యాలయం తీవ్రంగా స్పందిస్తూ ప్రజలకు హెచ్చరిక జారీ చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతతో సృష్టించిన ఈ వీడియోలను చూసి మోసపోవద్దని స్పష్టం చేసింది. కొన్ని సంస్థలు, పథకాలలో పెట్టుబడులు పెట్టాలని ప్రియాంక గాంధీ స్వయంగా ప్రోత్సహిస్తున్నట్లుగా ఈ నకిలీ వీడియోలను రూపొందించారు. ఇందుకోసం ఆమె ఛాయాచిత్రాలతో పాటు, ఏఐ ద్వారా ఆమె గొంతును (వాయిస్ క్లోనింగ్) అనుకరించారు. ఇవి అచ్చం ఆమె గొంతులాగే ఉండటంతో ప్రజలు నిజమని నమ్మే ప్రమాదం ఉందని ఆమె కార్యాలయం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వీడియోలు పూర్తిగా నకిలీవని, మోసపూరితమైనవని ప్రియాంక గాంధీ కార్యాలయం గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. వీటిని నమ్మి ఎవరూ నగదు పెట్టుబడులు పెట్టవద్దని విజ్ఞప్తి చేసింది. అలాగే, ఇటువంటి వీడియోలతో పాటు వచ్చే అనుమానాస్పద లింకులను అస్సలు క్లిక్ చేయవద్దని హెచ్చరించింది. సామాజిక మాధ్యమాల్లో ఇటువంటి పోస్టులు కనిపిస్తే వెంటనే వాటిని రిపోర్ట్ చేసి, ఆ ఖాతాలను బ్లాక్ చేయాలని ప్రజలకు సూచించింది. డీప్‌ఫేక్ సాంకేతికతను అడ్డుపెట్టుకుని ప్రముఖుల పేర్లతో సాగుతున్న ఆర్థిక మోసాల నుంచి ప్రజలను కాపాడేందుకే ఈ హెచ్చరిక జారీ చేసినట్లు వెల్లడించింది.

# ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది

మొదటిపేజీ తరువాయి

నీటిపారుదల, విద్యుత్ శాఖలు సంయుక్తంగా నాగార్జునసాగర్, శ్రీశైలం సహా రాష్ట్రంలోని పలు ప్రధాన రిజర్వాయర్లను దీనికోసం సమగ్రంగా పరిశీలిస్తున్నాయని చెప్పారు.ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అధిక వ్యయం కావడం ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు/సుంకాల వల్ల ఒక్క మెగావాట్ ప్రాజెక్టుపై దాదాపు రూ. 1.30 కోట్ల మేర అదనపు భారం పడుతోందని, ఈ నిబంధనలను కేంద్రం సడలిస్తే రాష్ట్రానికి సోలార్ విభాగంలో పెట్టుబడులు భారీగా వెల్లువెత్తుతాయని పేర్కొన్నారు.రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయం పెరగడంతో విద్యుత్ డిమాండ్ ఏకంగా 19,000 మెగావాట్లకు చేరిందని తెలిపారు. పేదలు, రైతుల విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం ఏటా రూ. 19,000 కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో ఉచిత సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేస్తున్నట్లు భట్టి ప్రకటించారు. అమ్రాబాద్ పరిధిలోని 80 గ్రామాలను పూర్తిస్థాయిలో సోలరైజ్ చేసేందుకు పైలట్ ప్రాజెక్ట్ చేపట్టామని, అక్కడ స్వతంత్ర 'మైక్రో గ్రిడ్లు' నిర్మించేందుకు కసరత్తు జరుగుతోందన్నారు. సాధారణ రైతులు, ప్రజలు తమ ఇళ్లు, పొలాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

# కేటీఆర్, హరీశ్ రావుపై లైంగిక వేధింపుల కేసు

మొదటిపేజీ తరువాయి

నిబంధనల ప్రకారం అలాంటి దుస్తులు, వస్తువులకు అనుమతి లేదని పోలీసులు చెప్పగా, బీఆర్ఎస్ నేతలు దుర్భాషలాడారని మహిళా కానిస్టేబుల్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. హరీశ్‌రావు, కేటీఆర్ తమను అవమానకర రీతిలో దూషించారని ఆమె తెలిపారు. హరీశ్‌రావు తన టీ-షర్టును విప్పి ఓ పోలీసు అధికారిపైకి విసిరి, మహిళా సిబ్బంది ముందే అర్ధనగ్నంగా నిలబడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కూడా అదే విధంగా ప్రవర్తించి, తమకు తీవ్ర ఇబ్బంది కలిగించారని ఫిర్యాదులో వివరించారు. ఆమె ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దాడి, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం వంటి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# డీకే శివకుమార్ పాలనకు 100 రోజులు.. సిద్ధరామయ్య ఏమన్నారంటే...!

మొదటిపేజీ తరువాయి

శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు, ఆయన మంత్రివర్గానికి సిద్ధరామయ్య అభినందనలు తెలియజేశారు.విధానసౌధలోని బాంక్వెట్ హాల్‌లో గురువారం నిర్వహించిన 'దృఢ కర్ణాటక సంకల్ప – 100 రోజుల విజయవంతమైన ప్రస్థానం' కార్యక్రమంలో సిద్ధరామయ్య ప్రసంగించారు. 100 రోజుల మైలురాయి అనేది కేవలం వేడుకలకు పరిమితం కాకూడదని, ప్రభుత్వం తన పనితీరును ప్రజల ముందు ఉంచి, బాధ్యతలను ఏ మేరకు నెరవేరుస్తోందో నిరూపించుకోవడానికి ఇదొక చక్కని అవకాశమని ఆయన పేర్కొన్నారు. డీకే శివకుమార్ నేతృత్వంలోని సర్కార్ సరైన మార్గంలోనే సాగుతోందని తాను భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదురైనప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీ పథకాలను విజయవంతంగా అమలు చేసిందని సిద్ధరామయ్య గుర్తు చేశారు. ఈ పథకాల కోసం ఏటా సుమారు రూ. 52,000 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఆయన వివరించారు. సామాజిక అసమానతలను తొలగించి, అన్ని వర్గాల పేదలకు అండగా నిలవడమే ఈ పథకాల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.ఇదే తరుణంలో ప్రతిపక్ష బీజేపీ తీరుపై సిద్ధరామయ్య విమర్శలు గుప్పించారు. బీజేపీ చేపట్టిన 'బళ్లారి చలో' పాదయాత్రను కేవలం ఒక రాజకీయ గిమ్మిక్కుగా ఆయన అభివర్ణించారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలోని కరువు పరిస్థితులపై చర్చించకుండా, కేవలం మాజీ మంత్రి నాగేంద్ర రాజీనామా అంశంపైనే బీజేపీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు. కరవు సహాయక చర్యల కోసం పూర్తిగా కేంద్రంపైనే ఆధారపడవద్దని, అవసరమైన తాలూకాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి, రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకోవాలని సీఎం శివకుమార్‌కు సూచించారు. పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉండాలని ఆయన కోరారు.

# తమిళనాడులో రాష్ట్ర పార్టీగా టీవీకే.. విజయ్ పార్టీకి ఈసీ అధికారిక గుర్తింపు...

మొదటిపేజీ తరువాయి

తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన టీవీకే, మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 108 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. రాష్ట్రవ్యాప్తంగా పోలైన ఓట్లలో 34.92 శాతం సాధించి తన సత్తా చాటింది. ఎన్నికల నిబంధనల ప్రకారం, ఒక పార్టీకి రాష్ట్ర పార్టీ హోదా దక్కాలంటే కనీసం 6 శాతం ఓట్లతో పాటు రెండు అసెంబ్లీ స్థానాలు గెలవాలి లేదా మొత్తం ఓట్లలో 8 శాతం సాధించాలి. టీవీకే ఈ నిబంధనలను సునాయాసంగా అధిగమించి ఈ గుర్తింపును సొంతం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీవీకేకు 'విజిల్'ను ఉమ్మడి గుర్తుగా ఈసీ కేటాయించగా, ఎన్నికల్లో సాధించిన ఘన విజయం నేపథ్యంలో ఇప్పుడు అదే గుర్తునే శాశ్వతంగా ఖరారు చేసింది. తాజా గుర్తింపుతో భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ టీవీకే ఇదే గుర్తుపై పోటీ చేసే అవకాశం లభించింది. తమిళనాడులో ఇప్పటికే గుర్తింపు పొందిన డీఎంకే, ఏఐఏడీఎంకే, సీపీఐ, వీసీకే, నామ్ తమిళర్ కట్చి, డీఎండీకే వంటి పార్టీల సరసన ఇప్పుడు టీవీకే కూడా చేరింది. ఫలితంగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీల సంఖ్య ఏడుకు చేరుకుంది. ఈ పరిణామం తమిళ రాజకీయాల్లో టీవీకేను ఒక ప్రధాన శక్తిగా ఆవిష్కరించింది.

# సాక్షాత్తు సీఎం సొంత ఊరిలోనే ఈ దుస్థితా..?

మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లికి చెందిన రైతులు తమ కష్టాలను వెళ్లబోసుకుంటున్న వీడియోను సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో పంచుకుంటూ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు."కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి వచ్చిన అసలైన మార్పు ఇదేనా?" అని కేటీఆర్ తన పోస్టులో ప్రశ్నించారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి పాలమూరు జిల్లాలో, ఆయన సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలోనే రైతులు విద్యుత్ కోతలతో విలవిలలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరిపడా వోల్టేజ్, సమయానికి కరెంటు రాకపోవడంతో పొలాలకు నీళ్లు పారక పంటలు ఎండిపోతున్నాయని, విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయని అన్నారు.

# ప్రతి గణపతి మండపం సిసి కెమెరాల పర్యవేక్షణలో ఉండాలి

### -ప్రశాంతమైన వాతావరణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలి -మంథని సీఐ బుద్దే స్వామి

**మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం , సెప్టెంబర్ 10:**

ప్రతి గణపతి మండపం సిసి కెమెరాల పర్యవేక్షణలో ఉండాలని, ప్రశాంతమైన వాతావరణంలో గణపతి ఉత్సవాలు జరుపుకోవాలని నిర్వాహకులకు మంథని సీఐ బుద్దే స్వామి సూచించారు. గురువారం మంథని పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ బుద్దే స్వామి ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, మంథని తహసిల్దార్ అరిఫుద్దీన్, మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఎస్సై సందీప్ కుమార్ పాల్గొని మాట్లాడారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాలు ఏర్పాటు చేసేవారు ఖచ్చితంగా పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలని తెలిపారు. విద్యుత్ శాఖ నుండి అనుమతి తీసుకొని విద్యుత్ సరఫరా తీసుకోవాలని, మండపాల వద్ద ఫైర్ నివారణ చర్యలు కచ్చితంగా పాటించాలని తెలిపారు. రెండు బాక్స్ స్పీకర్లు ఏర్పాటు చేసుకోవాలని, 10 తర్వాత భజన కార్యక్రమాలు కొనసాగించరాదని సూచించారు. ఎల్లప్పుడు ముగ్గురు స్వచ్ఛంద సేవకులు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ప్రతి గణపతి మండపం సిసి కెమెరా పర్యవేక్షణలో ఉండాలని సూచించారు. మండపాల వద్ద రాజకీయ నినాదాలు, మద్యం సేవించరాదు, లక్కీ డ్రాలు వంటివి ప్రోత్సహించరాదని వివరించారు. గణపతి నిమర్జనం సమయంలో సూచించిన చెరువులో కార్యక్రమం పూర్తి చేయాల్సి ఉంటుందని వివరించారు. గణపతి నిమజ్జన ఊరేగింపులు డీజే కు అనుమతి లేదని పేర్కొన్నారు.





# తుమ్మల నాగేశ్వరరావు పనితీరు, వ్యక్తిత్వంపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు

మొదటిపేజీ తరువాయి

ప్రజా ప్రతినిధులుగా మేము కూడా ఇంతటి ఓపిక, జవాబుదారీతనం ఉన్న మంత్రిని గతంలో చూడలేదు" అని వ్యాఖ్యానించారు.ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఏ సమస్యపై ఫోన్ చేసినా మంత్రి తుమ్మల వెంటనే స్పందిస్తారని... ఆదివారాలు లేదా సెలవు రోజుల్లో కూడా ప్రజా సమస్యలపై అందుబాటులో ఉంటారని తెలిపారు. సమీక్షలు లేదా పనుల్లో ఉండి ఫోన్ తీయలేకపోయినా, వీలైనంత త్వరగా తిరిగి ఆయనే కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు.ప్రజలు లేదా నియోజకవర్గాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళితే ఎంతో ఓపికతో విని, ఆ సమస్య పూర్తయ్యే వరకు అధికారులతో స్వయంగా మాట్లాడతారని పేర్కొన్నారు. పని ఏ దశలో ఉందో, ఎప్పుడు పరిష్కారమవుతుందో కూడా మళ్లీ తిరిగి ఫోన్ చేసి అప్‌డేట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. శాసనసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు, తోటి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పాలనా సమర్థతను, ఓపికను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యేలు సూచించారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

### -చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన మంథని కాంగ్రెస్ పార్టీ నాయకులు

**మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం , సెప్టెంబర్ 10:**

చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని మంథని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. రాష్ట్ర ఐటీ,ఈసీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు ల సూచన మేరకు గురువారం మంథని పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో చాకలి ఐలమ్మ (చిట్యాల ఐలమ్మ) వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. చాకలి ఐలమ్మ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి, ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిలి ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్, మాజీ ఎంపిపి కొండ శంకర్ లు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, తెలంగాణ వీర వనిత మన చాకలి ఐలమ్మ అని అన్నారు. చాకలి ఐలమ్మ ధైర్యం, ఆత్మ గౌరవం, పోరాట పటిమ తెలంగాణ ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. తన భూమి కోసం మాత్రమే కాకుండా, తనలాంటి ఎంతోమంది పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె పోరాడారని అన్నారు. అన్యాయం ఎంత పెద్దదైనా, దాని ముందు మన ధైర్యం మరింత పెద్దదిగా ఉండాలి అనే స్ఫూర్తిని తన జీవితంతో చూపించారని అన్నారు.సామాజిక అన్యాయం, దోపిడి, అనచివేతకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం నాటి నిరంకుశ పాలనకు ఎదురొడ్డి నిలిచిన ఐలమ్మ, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన మహోనీయురాలని అన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, ఆత్మ గౌరవాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రతి ఒక్కరు బాధ్యతాన్ని తెలిపారు. తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మ గౌరవం కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ సేవలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని, ఆమె త్యాగాలను స్మరించుకుంటూ సమానత్వం, సామాజిక న్యాయం సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు,గ్రామ సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.



# లక్ష రూపాయల విలువైన వాటర్ ప్లాంట్ అందజేత

**తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 10 ( ప్రజా వీక్షణం ):**

కడకట్లలో బీవీకే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీఆర్ గోయింకా డిగ్రీ కళాశాలకు బిజెపి నర్సాపురం మీడియా కన్వీనర్ నరిసే సోమేశ్వరరావు తన తండ్రి నరిసే వీర్రాజు జ్ఞాపకార్థం లక్ష రూపాయల విలువైన వాటర్ ప్లాంట్‌ను అందజేశారు.విద్యార్థులకు స్వచ్ఛమైన, శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఈ వాటర్ ప్లాంట్‌ను కళాశాలకు అందించడం పట్ల పలువురు అభినందనలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఈతకోట తాతాజీ ప్రముఖ వ్యాపారవేత్త నంద్యాల కృష్ణమూర్తి, సుంకవల్లి రామకృష్ణ జిఎంఆర్ విద్యా సంస్థల అధినేత గ్రంధి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి, కళాశాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేలా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టిన నరిసే సోమేశ్వరరావును అభినందించారు.

# రూ. 200 కోట్ల భూమిని రేవంత్ రెడ్డి ఆయన సోదరుడికి కట్టబెట్టాడు: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

ఆ వివాదాస్పద భూ కేటాయింపు స్థలాన్ని ఈరోజు ఆయన సందర్శించిన పర్యవేక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని నిత్యం చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, ఆ సమయాన్నంతా తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కాకుండా తన సొంత సోదరులు, బినామీ షెల్ కంపెనీల లబ్ధి కోసమే కేటాయిస్తున్నారని ఎద్దేవా చేశారు.కేవలం రూ. లక్ష మూలధనంతో నడిచే కంపెనీకి ఐదెకరాల విలువైన భూమిని ఎలా కేటాయిస్తారని కేటీఆర్ నిలదీశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇజ్రాయెల్ వ్యాపార భాగస్వామ్యాలపై ప్రధాని మోదీని ప్రశ్నిస్తుంటే, ఇక్కడ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రేవంత్ రెడ్డి సోదరుడి కోసం 'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్' సంస్థతో ఒప్పందాలు కుదుర్చుకుని ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ల పేరుతో భూములు కొల్లగొడుతోందని ఆరోపించారు.నెలకు రూ.4,000 పింఛన్, మహిళలకు రూ.2,500, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలకు మొండిచేయి చూపించిన కాంగ్రెస్, సీఎం సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి, వందల కోట్ల ఆస్తులు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. ఈ భారీ భూ కుంభకోణంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే తక్షణమే ప్రవర్తన, పత్రాలపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# సంపాదకీయం

## ప్రైవేటీకరణకే మొగ్గు?

ఇస్రో అంటే నేటి ప్రపంచంలో తెలియని వారుండరు. ఇస్రో అంతరిక్షయానంలో కీలక అడుగులు వేస్తూ భారతదేశ అమ్ములపొదిలో తనదైన స్థానంతో ముందుకు దూసుకుపోతోంది. ఇప్పటికే ఎన్నో పరిశోధనలతో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకుంది. అలంటి ఇస్రో నేడు ప్రైవేటుపరం కాబోతోందని పుకార్లు చికారై చెక్కర్లు కొడుతోంది. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రైవేటీకరణ అడ్డూఅదుపు అనేది లేకుండా సాగిపోతున్నది. అనేక ప్రభుత్వరంగ కంపెనీలను ఒక్కొక్కటిగా అస్మదీయులైన కార్పొరేట్లకు కట్టబెడుతుండటం తెలిసిందే. ముఖ్యంగా రేవులు, విమానాశ్రయాల ప్రైవేటీకరణ ఈ ధోరణికి అద్దం పడుతున్నది. తాజాగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేట్ బాట పట్టిస్తున్నారనే వివాదం ముసురుకుంటున్నది. ప్రభుత్వం ఇస్రోను ప్రైవేటీకరించడం లేదని అంటున్నప్పటికీ, జరుగుతున్న పరిణామాలు మరోరకం సంకేతాలు వెలువరిస్తున్నాయి. రాకెట్ల తయారీ, ఉపగ్రహాల నిర్మాణం, లాంచ్ సేవలు వంటి కీలక రంగాలను క్రమంగా ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే యత్నాలు జరుగుతున్న మాట వాస్తవం. ఒకప్పుడు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అంతరిక్ష రంగంలో కార్పొరేట్ పెట్టుబడులకు ద్వారాలు తెరుచుకుంటున్నాయిజరుగుతున్న పరిమాణాలపై ఇస్రో సిబ్బందిలో అసమ్మతి రాజుకుంటున్నది. తమ ప్రాముఖ్యం తగ్గిపోతుందని శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. అనుభవజ్ఞులైన శాస్త్రవేత్త లు ప్రైవేట్ రంగానికి వెళ్లిపోతున్నారనే వార్తలు కూడా జోరుగా వినవస్తున్నాయి. అందుకు ఉద్యోగులు ఎంచుకుంటున్న స్వచ్ఛంద ఉద్యోగ విరమణపై సంస్థ ఆంక్షలు విధించాల్సి రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడం తప్పు కాదు. ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష రంగంలో ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్యం పెరుగుతున్నది. కానీ అక్కడ ప్రభుత్వ సంస్థలు తమ కేంద్రీయ పాత్రను కోల్పోవడం లేదు. ఉదాహరణకు, అమెరికాలో నాసా ప్రైవేట్ కంపెనీలతో పనిచేస్తున్నప్పటికీ, దిశానిర్దేశం, నియంత్రణ, పరిశోధనలో కీలక స్థానాన్ని నిలుపుకొంటున్నది. కానీ భారతదేశంలో మాత్రం పరిస్థితి భిన్నంగా మారుతున్నదనే వాదన వినిపిస్తున్నది. ఇస్రోను బలహీనపరుస్తూ, కార్పొరేట్ సంస్థలను ముందుకు తెస్తున్నారనే విమర్శలు జోరందుకుంటున్నాయి. ఇస్రోలో ప్రైవేటీకరణ దిశగా జరుగుతున్న చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఉద్యోగ సంఘాలు కేంద్ర ప్రభుత్వానికి గట్టిగా అల్టిమేటమ్ ఇచ్చాయి. ఇస్రో స్వరూప, స్వభావాలను దెబ్బతీసే విధంగా కీలక కార్యకలాపాలను ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తే తాము మౌనంగా ఉండబోమని తాఖీదు జారీ చేశాయి. పరిశోధన స్వాతంత్ర్యం, ఉద్యోగ భద్రత, సంస్థ భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వం తక్షణమే తన విధానాలపై పునరాలోచన జరుపాలని కోరుతున్నాయి. లేకపోతే ఆందోళనలకు దిగడమే కాకుండా, దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తల స్థాయిలో నిరసనలు ఉధృతం చేసే అవకాశమున్నదని తెలిపాయి. ఇది కేవలం ఉద్యోగుల అసంతృప్తి కాదు, ఇస్రో భవిష్యత్తుపై పెరుగుతున్న ఆందోళనకు ప్రతిబింబం. ఇన్-స్పేస్, ఎన్ఎస్ఐఎల్ వంటి కొత్త సంస్థలు కూడా ఈ చర్చలోకి వస్తున్నాయి. ఆదానీ, అంబానీ వంటి దేశంలోని అగ్ర కార్పొరేట్ సమూహాలు అంతరిక్ష రంగంలోకి అడుగుపెట్టడం మరో కీలక చర్చకు దారితీస్తున్నది. ప్రభుత్వ విధానాల మార్పులతో స్పేస్ రంగం ప్రైవేట్ పెట్టుబడులకు ద్వారాలు తెరుచుకోవడంతో, ఈ భారీ కంపెనీలు రాకెట్ తయారీ, ఉపగ్రహ సేవలు, స్పేస్ టెక్నాలజీ వ్యాపారాల్లో అవకాశాలను అన్వేషిస్తున్నాయి. ఒకవైపు ఇది పెట్టుబడులు, సాంకేతిక అభివృద్ధికి దోహదపడుతుందనే వాదన ఉన్నప్పటికీ, మరోవైపు ఇస్రో వంటి ప్రభుత్వరంగ సంస్థల సామర్థ్యాన్ని ఉపయోగించుకొని కార్పొరేట్లు అదే రంగంపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ విధానాల్లో పారదర్శకత లేకపోవడం, స్పష్టమైన హద్దులు లేకపోవడం వల్ల సందేహాలు మరింత బలపడుతున్నాయి. ప్రైవేట్‌రంగ భాగస్వామ్యంతో అంతరిక్ష రంగం విస్తరిస్తుందని, పెట్టుబడులు వస్తాయని తద్వారా ఉద్యోగాలు పెరుగుతాయనేది ప్రభుత్వ వాదన. ఇది కొంతవరకు నిజమే కావచ్చు. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించాల్సిందే. అయితే అందుకు ఇస్రోను బలిపెట్టకుండా చూడాలి. పరిశోధన, ఆవిష్కరణ, వ్యూహాత్మక నియంత్రణ.. ఇవన్నీ ఇస్రో చేతుల్లోనే ఉండాలి. కార్పొరేట్ సంస్థలు సహాయక భాగస్వాములుగా మాత్రమే ఉండాలి. ఏదేమైనా ఇస్రోను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఒకవేళ ప్రైవేటు దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తే అలాంటి ఆలోచనలు విరమించుకోవాలి. ప్రైవేటు దిశగా ప్రయత్నాలు చేస్తే దేశ అడ్డుకొని ప్రైవేటు పరంగా కాకుండా చూడాల్సిన బాధ్యత దేశ్ ప్రజలపై ఎంతైనా ఉంది.

## గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి వారి హుండీ ఆదాయం రూ. 64,93,560/-

### --- 99 రోజుల్లోనే భారీగా సమకూరిన భక్తుల కానుకలు

### --- పకడ్బందీగా హుండీల లెక్కింపు చేపట్టిన అధికారులు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబర్ 10

(ప్రజా వీక్షణం):

ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గురవాయిగూడెం గ్రామంలో వేంచేసి యున్న మద్ది ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో హుండీలను ఈరోజు అత్యంత పకడ్బందీ వాతావరణంలో తెరిచి లెక్కించడం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలను దేవస్థాన సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారిణి ఆర్. వి చందన ప్రెస్ నోట్ ద్వారా అధికారికంగా వెల్లడించారు. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో స్వామివారికి సమర్పించిన కానుకల ద్వారా కేవలం 99 రోజులకు గాను దేవస్థానానికి భారీ మొత్తంలో ఆదాయం సమకూరినట్లు అధికారులు స్పష్టం చేశారు.సదరు లెక్కింపును జిల్లా దేవదాయ శాఖ అధికారి కూచి పూడి శ్రీనివాసు, మరియు మద్ది ఆంజ నేయ స్వామి వారి దేవస్థానం చైర్మెన్ రాజాన సత్యనారాయణ వారి పర్యవేక్ష ణలో అత్యంత పారదర్శకంగా నిర్వహించారు. పోలీస్ మరియు రెవిన్యూ అధికారుల సమక్షములో కే.వీ.బీ. బ్యాంక్ సిబ్బంది ఎంతో శ్రమించి ఈ లెక్కింపును పూర్తి చేశారు.ఇలా హుండీలను



తెరచి లెక్కించగా... 99 రోజులకు గాను దేవస్థానము హుండీల ద్వారా రూ. 63,94,360/- లు, అదేవిధంగా అన్నదానం హుండీ ద్వారా రూ. 99,200/- లు సమకూరినట్లు తేలింది. ఈ రెండు విభాగాలు కలుపుకుని మొత్తంగా దేవస్థానమునకు రూ. 64,93,560/- ఆదాయం సమకూరినట్లు అధికారులు అధికారికంగా ప్రకటించారు.ఈ లెక్కింపు కార్యక్రమములో ఆలయ ధర్మకర్తలు ధూళిపాల సూర్య చంద్ర వెంకట ప్రభాకరరావు, దూనబోయిన నారాయణ మూర్తి, తిరుమలశెట్టి నాగ వరలక్ష్మి అనీల తదితరులు ప్రత్యక్షంగా పాల్గొని ప్రక్రియను పరిశీలించారు. భక్తులు స్వామివారికి సమర్పిస్తున్న కానుకలు మరియు అన్నదాన విరాళాలు దేవస్థాన అభివృద్ధికి, భక్తులకు మెరుగైన వసతులు కల్పించ డానికి ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

## నేర సమీక్షలో పెండింగ్ కేసులపై దృష్టి

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 10 (ప్రజా వీక్షణం న్యూస్)

వరంగల్ పోలీస్ కమిషన రేట్ కార్యాలయంలో గురు వారం కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆధ్వర్యం లో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసుల దర్యాప్తు, నిందితు ల అరెస్టులు, సాక్ష్యాధారా ల సేకరణ, కోర్టు కేసుల పురోగతిపై సమీక్షించారు. నిందితులు పరారీలో ఉంటే ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టి సాంకేతిక పరిజ్ఞానంతో త్వరితగతిన అరెస్టు చేయాలని ఆదే శించారు. మహిళలు, చిన్నారులపై నేరాలు, సైబర్ నేరాలు, ఆస్తి నేరా లు, మాదకద్రవ్యాల కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. గణేష్ నవరాత్రుల సంద ర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు, ముమ్మర పెట్రోలింగ్ చేపట్టాలని ఆదేశించారు. మత్తుపదార్థాల నియంత్ర ణలో ప్రతిభ కనబరిచిన డ్రగ్ కంట్రోల్ అధికారులు, సిబ్బందిని అభినందించి రివార్డులు అందజేశారు. సమావేశంలో డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీ లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.




## వీర తెలంగాణ అగ్నికణం చిట్యాల ఐలమ్మ

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 10 (ప్రజా వీక్షణం న్యూస్)

చిట్యాల ఐలమ్మ తెలంగా ణ సాయుధ రైతాంగ పోరా టానికి స్ఫూర్తిగా నిలిచిన వీరనారి అని సీపీఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ అన్నారు. గురువా రం బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఫాతిమా జంక్షన్ లోని ఐలమ్మ విగ్రహం వద్ద ఆమె 41వ వర్ధంతిని నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎల్లేష్ మాట్లాడుతూ భూస్వాము లు, నిజాం పాలనకు వ్యతి రేకంగా ఐలమ్మ కమ్యూని స్టుల సహకారంతో వీరోచి తంగా పోరాడి పంటను రక్షించుకున్నారని తెలిపా రు. సాయుధ రైతాంగ పోరాట ఫలితంగా పేదల కు భూములు, ఆత్మగౌరవం, భూమిపై హక్కు లభించాయని పేర్కొన్నా రు. ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై పోరా డాలని, సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు జరిగే సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో నేదునూరి రాజ మౌళి, నాంపల్లి లక్ష్మయ్య, సామచంద్రమౌళి, సోమ మహేందర్, పుల్ల సారంగం, కావేరి తదితరులు పాల్గొ న్నారు.




## మధుయాష్కి గౌడ్ ను సన్మానించిన శ్రీనివాసులు..



దేవరకద్ర సెప్టెంబర్ 10 ప్రజా వీక్షణం

ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ కమిటీ చైర్ పర్సన్ గా ఎన్నికైన మధు యాష్కి గౌడ్ ను గురువారము అసెంబ్లీ ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబిసి ఉపాధ్యక్షులు గద్వాల జిల్లా అబ్జర్వర్ రాజమూరి శ్రీనివాసులు, మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, నూతన బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు.

## విద్యార్థి నేతల అరెస్ట్‌పై బీఆర్ఎస్వీ ఆగ్రహం

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 10 (ప్రజా వీక్షణం న్యూస్)

విద్యార్థి సమస్యల పరిష్కా రం కోసం పోరాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు అక్రమంగా అరె స్ట్ చేశారని ఆ సంఘం నాయకులు ఆరోపించారు. కేయూ బీఆర్ఎస్వీ జట్టి రాజేందర్, ఓయూ విద్యార్థి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దమ్మ రమేష్‌లను హసన్ పర్తి పోలీసులు అరెస్ట్ చేసి నట్లు తెలిపారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయ డంతో పాటు పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల పక్షాన తమ పోరాటాన్ని అణిచి వేసేందుకు ముందస్తు అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. అరెస్టుల తో విద్యార్థుల ఉద్యమాన్ని ఆపలేరని, సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన లను ఉధృతం చేస్తామని బీఆర్ఎస్వీ నాయకులు హెచ్చరించారు.



## మట్టి వినాయక విగ్రహాలపై అవగాహనకు 1000 కరపత్రాల పంపిణీ

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 10 (ప్రజా వీక్షణం న్యూస్)

పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించా లని సుజాత విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ ఆకు తోట శాంతారాం కర్ణ పిలు పునిచ్చారు. 66వ డివిజన్ పరిధిలోని పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాల ఆవశ్యకతపై రూపొందించి న 1,000 కరపత్రాలను గురువారం ఆవిష్కరించి విద్యార్థులకు, ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా శాంతారాం కర్ణ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను చెరు వుల్లో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమై జలచరాలు, పశుపక్షాదుల కు నష్టం కలుగుతుందని తెలిపారు. ప్రకృతి సహజ సిద్ధమైన మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాల ను పూజించాలని సూచిం చారు. పాఠశాల పర్యావర ణ మిత్ర యూనిట్ ఆధ్వ ర్యంలో గత 30 ఏళ్లుగా ప్రతి సంవత్సరం సుమారు 1,500 మట్టి వినాయక విగ్రహాలను విద్యార్థులతో తయారు చేయించి ఉచి తంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పర్యావరణ పరి రక్షణ కార్యక్రమాలకు ఇప్ప టికే జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఆరు పర్యావరణ మిత్ర అవార్డులు అందుకు న్నట్లు తెలిపారు. విద్యార్థు ల్లో పర్యావరణంపై చిన్న నాటి నుంచే అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు పేర్కొన్నారు. కార్య క్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గూడూరు లక్ష్మీనారాయ ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





ప్రజావీక్షణం
దినపత్రిక

## స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం మాదే

### ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు

**బాపట్ల : సెప్టెంబర్ 10 ( ప్రజా వీక్షణం )**

బాపట్ల మున్సిపల్ ఎన్నికలు మరియు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు కొద్ది రోజుల్లో జరగనున్నాయని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ స్పష్టం చేశారు.బుధవారం బాపట్ల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.....కూటమి ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలే తమకు శ్రీరామరక్ష అని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అరాచకాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని, అందుకే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూడా ప్రజలు తమకే పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు.34 వార్డుల్లో కూటమి జెండా ఎగరాలని కార్యకర్తలు కష్టపడి పనిచేయాలనిపిలుపునిచ్చారు.వార్డుల వారీగా ఇప్పటి నుండే ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించాలని సూచించారు. టికెట్ల విషయంలో సొంత కార్యకర్తలకు, నిస్వార్థంగా పనిచేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.రాబోయే ఎన్నికల్లో బాపట్ల మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు,బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ ఆథారిటి చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు పాల్గొన్నారు.




## సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ 72వ జయంతి సభ

**బాపట్ల : సెప్టెంబర్ 10 ( ప్రజా వీక్షణం )**

ప్రముఖ సాహిత్య సంస్థ సాహితీ భారతి వ్యవస్థాపక అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ 72వ వర్ధంతి సభ బాపట్ల పట్టణంలోని డా?? బి ఆర్ అంబేద్కర్ జ్ఞాన మందిరములో నిర్వహించారు.ఈ సభకు డా. బి.ఆర్ అంబేద్కర్ విజ్ఞాన మందిరం వ్యవస్థాపకులు జెట్టి జోసెఫ్ అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథిగా బాపట్ల జిల్లా సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు జి.వి. బ్రహ్మం,సాహితీ భారతి గౌరవ అధ్యక్షులు ఏం.జాకబ్ సాహితి భారతి అధ్యక్షులు మ్రి. మాల్యాద్రి రావు,ఉపాధ్యక్షులు దగ్గుమల్లి.శామ్యూల్ భావపురి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు బందా బాబు తదితరులు పాల్గొని రావూరి నరసింహ వర్మ సాహిత్య సేవ గురించి, త్యాగనిరతి గురించి,తెలుగు భాష పట్ల వారికి ఉన్న అపార అభిమానాన్ని గురించి ప్రసంగించారు.సభానంతరం ప్రముఖ సాహిత్యవేత్తలు, కళాకారులైన దగ్గు మల్లి ధర్మారావు,డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు,ఆట్ల బాలిరెడ్డి, మార్పు అంకయ్య షేక్.మస్తాన్ వలి ను ఘనంగా సన్మానించారు.బి శ్రీరామచంద్రమూర్తి,కే. కాళిదాసు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. షేక్. సయీద్ పీర్,అబ్దుల్ ఖాదర్ జిలాని సన్మాన పత్రాలను పఠించారు.షేక్.ఆదం షఫీ సభ నిర్వహణ చేశారు.



## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రవేశానికి గడువు పెంపు

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 10(ప్రజా వీక్షణం):**

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మొదటి సంవత్సరము ప్రవేశానికి ఈనెల సెప్టెంబర్ 30 వరకు గడువు పెంచినట్లు శ్రీ రామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల( అటానమస్) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరము ఓపెన్ ఇంటర్ డిప్లమా ఐటిఐ పూర్తి చేసిన వారు మొదటి సంవత్సరానికి అడ్మిషన్ పొందవచ్చు అని పేర్కొన్నారు. కొయ్య చెంచు దివ్యాంగులకు ఎటువంటి ఫీజు ఉండదని చెప్పారు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరము తృతీయ సంవత్సరము చదువుతున్న విద్యార్థులు యూనివర్సిటీ ఫీజులు ఈ నెల 30 వరకు చెల్లించాలని వివరించారు.

డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
DR. B.R. AMBEDKAR OPEN UNIVERSITY
EDUCATION AT YOUR DOORSTEP

## ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం

**పర్చూరు : సెప్టెంబర్ 10 ( ప్రజా వీక్షణం )**

ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం ఉప్పుటూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల వద్ద ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అవగాహన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా డాక్టర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ మానవ జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదని, ఒడిదుడుకులు,కష్టాలు, వైఫల్యాలు ఎదురవడం సహజమని,కానీ తీవ్రమైన బాధ,ఒంటరితనం మనసును చుట్టుముట్టినప్పుడు కొందరు ఆత్మహత్యే ఏకైక మార్గమని భావిస్తారని,నిజానికి ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదని,అది కేవలం ఒక్క వ్యక్తినే కాకుండా సంపూర్ణ కుటుంబాన్ని తీవ్ర మానసిక ఇబ్బందులకు గురి చేస్తుందని, పరీక్షల్లో ఫెయిల్ అవ్వడం, నిరుద్యోగం,పని భారం, సామాజిక ఒత్తిళ్ళు,అప్పుల భారం,బంధాలు తెగిపోవడం, కుటుంబ కలహాలు,లవ్ ఫెయిల్యూర్ వంటి సమస్యలు వచ్చినప్పుడు మనిషి తీవ్రమైన మానసిక కృంగుబాటుకు గురవడం వల్ల,ఆ సమస్యలను ఎదుర్కొ నలేమని, ఆత్మహత్యే పరిష్కార మార్గమని భావిస్తుంటారని,కానీ ఆ సమయం లో ఒక్క అడుగు ముందుకేసి వైద్యుని సలహాలు,సూచనలు పాటించి, మందులు లేదా కౌన్సిలింగ్ తీసుకోవడం ద్వారా చాలా వరకు మనిషి మానసిక పరిస్థితి మెరుగుపడుతుందని, హోమియోపతిలో కూడా మానసిక వ్యాధులకు చక్కని ఔషధాలు అందుబాటులో ఉన్నాయని,అవి అత్యుత్తమ ఫలితాలను కనబరుస్తాయని, ఈ విషయాన్ని కేరళలోని కొట్టాయంలో ఉన్న జాతీయ హోమియోపతి మానసిక ఆరోగ్య పరిశోధనా సంస్థ ఫలితాలు ధ్రువీకరిస్తున్నాయని, కావున మనలో ఎవరైనా మాటిమాటికి ఆత్మహత్య ప్రయత్నాలు చేస్తున్నా లేదా ఎవరితోనూ మాట్లాడకుండా పూర్తిగా ఒంటరిగా ఉండటం, ఎప్పుడూ నిరుత్సాహ ధోరణిని ప్రదర్శిస్తుండడం, నిద్రలేమి లేదా అతిగా నిద్రపోవడం, ఆకలి మందగించడం, గతంలో ఇష్టపడిన పనులపై ప్రస్తుతం ఆసక్తి కోల్పోవడం వంటి లక్షణాలను కనబరిస్తే, వారితో స్నేహపూర్వకంగా




మాట్లాడి వీలైనంతవరకు వారి సమస్యలను గుర్తించి, వారిని తీర్పు తీర్చకుండా, ఓదార్చి, పరిష్కార మార్గాలను సూచించి, నేనున్నానని మీరు ఇచ్చే భరోసా ఎంతో మందిని ఆత్మహత్యలకు పాల్పడకుండా కాపాడుతుందని, 144 16 అనే టెలి-మానస్ ప్రభుత్వ హెల్ప్ లైన్ నెంబర్కు కాల్ చేయడం ద్వారా ఫోన్లోనే వైద్యుని సలహాలు, సూచనలు 24/7 అందుబాటులో ఉంటాయని, ప్రాణం ఎంతో విలువైనదని, తొందరపడి ఆత్మహత్యలకు పాల్పడవద్దని, మన చుట్టూ ఉన్న వారిని కాపాడడం మన ందరి బాధ్యతని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యశాలకు వచ్చిన రోగులు, స్వచ్ఛంద సేవకురాలు నాగ రాజా, ఆశా రత్నకుమారి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## రావమ్మా.. చినుకమ్మా..

--ముందు మురిపించింది

- ముఖం చాటేసిన వర్ణుడు..

---కీలక దశలో వాడిపోతున్న పంటలు

---కాపాడుకునేందుకు బోర్లపై ఆధారపడుతున్న రైతులు

వరుణదేవా కరుణించు..

వరుణుడు కరుణ చూపరా....

**దేవరకద్ర సెప్టెంబర్ 10 ప్రజావిక్షణం**

అన్నదాతలు చివరి దశ కోసం ఎదురుచూస్తున్నారు. జూన్ జులైలో జడిపించిన వరుణుడు. కనుమరుగయ్యాడు. లోటు వర్షపాతం నమోదవడంతో పంటలపై ప్రభావం చూపుతోంది. వానాకాలం ప్రారంభంలో వర్షాల కోసం ఎదురుచూపులు తప్పలేదు. పంటల సాగుపై అన్నదాత అయోమయంలో ఉండగా జులైలో కేవలం ఒక్క రోజుల్లోనే అత్యధిక వర్షపాతం నమోదైనది. మళ్లీ వరుణుడుదోబూచులాడుతున్నాడు. రోజులు గడుస్తున్నా సరైన వర్షాల్లేక వేసిన పంటల ఎదుగుదల లేక అన్నదాతలు నష్టపోతున్నారు .రెండేళ్లుగా కరువుతో అతలాకుతలమైన రైతులు ఈ యేడాది కోటి ఆశలతో సాగుకు పంటలు వేసిన మొలకెత్తి పంటలు రైతన్నకు మురిపించింది కానీ పంటలకు వర్షం ఒకేసారి కురువకపోవడంతో పంటలు ఎండ పడుతున్నాయని రైతులు అదోగోచరంగా దేవుని ప్రార్థిస్తున్నారు. వర్షాలు కురవాల్సిన సమయంలో వరుణుడు దోబూచులాడుతున్నాడు. తొలకరితో పలకరించిన వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. తొలకరితో మురిపించిన వర్షాలు క్రమంగా తగ్గుముఖం పట్టడం తో ఆశ నిరాశల మధ్య రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. గ్రామాల్లో పత్తి సాగు కంట సోయా ఉత్సాహం చూపారు. రైతులు వేలకు వేలు పెట్టుబడి పెట్టి



ఎరువులు, విత్తనాలు కొనుక్కున్నారు. దుక్కులు దున్నుకుని విత్తనాలు చల్లుకున్నారు. విత్తనాలు చల్లుకున్న రైతులకు వరుణ దేవుడు అప్పట్లో కురిసి ఒకేసారి నిరాశ పరచడంతో చేతికొచ్చిన వరి మరియు పత్తి పంట దక్కుతుందో లేదని రైతులు తల్లడిల్లుతున్నారు. మొలకెత్తక వరి పంటలు పత్తి పంటలు రైతన్నకు మురిపిస్తూ ఉరుకలు వేసింది. వర్షం పడకపోవడంతోని ఆందోళనకు గురవుతున్నారు. వరుణ దేవుడు కరిణించాలని రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. వర్షాలు కురవాలని గ్రామ దేవతలకు పూజలు చేస్తున్నారు. చిన్నారులు కప్ప కావడి ఆడుతూ వరుణదేవుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు. వర్షాలకు బదులుకుఎండలు దంచి కొడుతుండటంతోరైతులు అయోమయానికి గురువుతున్నారు.వర్షాలు లేక పత్తి చేను మరియు వరి చేను ఎండుతోంది( రైతు) వర్షాలు కురవక పోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. సోయా. పత్తి చెట్లు ఎండిపోతున్నాయి.. వర్షాలు రాక పోవడంతో వేపుగా పెరిగిన పత్తి పంట. సోయా పంట వాడిపోతున్నాయి. పంటలకు అధిక మొత్తంలో పెట్టుబడి పెట్టాం. వర్షాలు రాకుంటే పంట దిగుబడి తగ్గే అవకాశం ఉంది. పెట్టుబడులు రాకపోవచ్చు రైతు దిగులు చెందుతున్నరు.

## 1000 రోజుల్లో రూ.1000 కోట్ల అభివృద్ధి పనులు..

### దేవరకద్రలో జీఎంఆర్ దూకుడు....

### ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రహదారులు, బ్రిడ్జిల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరు..

### కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి..

**దేవరకద్ర, సెప్టెంబర్ 10 ప్రజా విక్షణం**

దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు, మరియు అడ్డాకుల కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని రహదారులు, బ్రిడ్జిల సమస్యలకు ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రత్యేక చొరవతో శాశ్వత పరిష్కారం లభిస్తోందని పేర్కొన్నారు.1000 రోజుల్లో 1000 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు సాధించిన ఘనత దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డికే దక్కుతుందని మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ రావు అన్నారు. కౌకుంట్ల మండల కేంద్రంలో కౌకుంట్ల, అడ్డాకుల మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు గురువారం పత్రికా విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కౌకుంట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాదిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, మాట్లాడుతూ, కౌకుంట్ల, ఇస్రంపల్లి, పెద్ద మునగల్చేడ్, రాచాల, రేకులంపల్లి, వెంకంపల్లి ప్రాంతాల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న రహదారులు, వంతెనల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు.చీఎం-44 నుంచి ఇస్రంపల్లి, పెద్ద మునగల్చేడ్ మీదుగా కౌకుంట్ల వరకు రహదారి అభివృద్ధి, ఫూదీ నిర్మాణానికి రూ.35 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు.అదేవిధంగా వెంకంపల్లి--రేకులంపల్లి మార్గంలోని బ్రిడ్జి నిర్మాణానికి రూ.1 కోటి 80 లక్షలు,దేవరకద్ర--ఆత్మకూర్‌రాఔణ రోడ్డులో కౌకుంట్ల--రాచాల, ఇస్రంపల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ.5 కోట్ల 40 లక్షలు మంజూరైనట్లు వెల్లడించారు.వర్షాకాలంలో ఆయా ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోవడం, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం, కొన్ని సందర్భాల్లో ప్రాణ, పశు నష్టాలతో పాటు విద్యుత్ స్తంభాలు, మోటార్లు, పైప్‌లైన్లు కొట్టుకుపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని నాయకులు తెలిపారు.ఈ సమస్యలకు



శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్లారని, దీంతో ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు.ప్రజల కష్టాన్ని తన కష్టంగా భావించి, దశాబ్దాల సమస్యలకు పరిష్కారం చూపుతున్న ప్రజా నాయకుడు జి. మధుసూదన్ రెడ్డి, అని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు.ఈ అభివృద్ధి పనులకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కలకు కౌకుంట్ల, అడ్డాకుల మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల తరఫున ధన్యవాదాలు తెలిపారు.గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు ఇచ్చిన హామీలతో పోలిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల కాలంలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన హామీలపై చర్చ పెడితే వాస్తవాలు ప్రజలకు స్పష్టమవుతాయని కాంగ్రెస్ నాయకులు అన్నారు.గత పాలకుల తీరును ప్రజలు గమనించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని వారు పేర్కొన్నారు.దేవరకద్ర నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ.. రహదారులు, బ్రిడ్జిల నిర్మాణంతో ప్రజల రాకపోకల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తున్నామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో అడ్డాకుల మండల పార్టీ అధ్యక్షుడు శ్రీహరి, కౌకుంట్ల సర్పంచ్ నరేష్ కుమార్, అడ్డాకుల గ్రామ సర్పంచ్ దశరథ్ రెడ్డి, విజయ్ మోహన్ రెడ్డి, వేగనాద్, ముచ్చింతల సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, దేవరకద్ర నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు మొహమ్మద్ షఫీ,మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శకుంతల, ఓబీసీ అధ్యక్షుడు ఆంజనేయులు, కురుమూర్తి స్వామి మాజీ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి,తో పాటు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చుంచుపల్లిలో విజయ మినీ పాల డైరీ కేంద్రం

## - ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలి

## - భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ సూచన

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 10(ప్రజా వీక్షణం:**

చుంచుపల్లిలో విజయ డెయిరీ కోసం ఇప్పటికే స్థలం కేటాయించినందున ఆ స్థలంలో విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా చర్యలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు లక్ష్మీదేవిపల్లిలోని ప్రస్తుత విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రం ఉన్న స్థలాన్ని అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నందున కేంద్రాన్ని చుంచుపల్లికి మార్చే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఇందులో భాగంగా లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలోని విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని గురువారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి కేంద్రాన్ని చుంచుపల్లికి మార్చే అంశంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ప్రతిరోజూ జరుగుతున్న పాల సేకరణ శీతలీకరణ ప్రక్రియ అందుబాటులో ఉన్న మౌలిక వసతులు పరికరాల పనితీరు తదితర వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రం పరిధిలో సుమారు 30 గ్రామాలకు చెందిన 400 మంది రైతులు పాల సేకరణకు అనుసంధానమై ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 500 లీటర్ల వరకు పాలు సేకరిస్తుండగా పాల ఉత్పత్తి అధికంగా ఉండే సీజన్‌లో రోజువారీ సేకరణ సుమారు 4,000 లీటర్ల వరకు పెరుగుతుందని వివరించారు. ఉదయం సాయంత్రం నిర్ణీత సమయాల్లో పాలను సేకరించి ఖమ్మం డెయిరీకి తరలిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ కేంద్రంలోని కూలింగ్ ట్యాంక్ స్టోరేజ్ వ్యవస్థ కంప్రెసర్ తదితర పరికరాలను పరిశీలించారు. ప్రస్తుత భవనం పరికరాల పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అంశంపై అధికారులతో చర్చించారు. చుంచుపల్లిలో విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే స్థలాన్ని గుర్తించి విజయ డెయిరీ అధికారులకు సూచించినందున కేంద్రం ఏర్పాటుకు అవసరమైన తదుపరి చర్యలను త్వరితగతిన చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. రైతులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా కేంద్రాన్ని ఏర్పాటు చేసి,పాల సేకరణ శీతలీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.కేంద్రాన్ని మార్చే సమయంలో పాల సేకరణకు ఎలాంటి అంతరాయం



కలగకుండా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. నూతన కేంద్రం అందుబాటులోకి వచ్చిన తర్వాత రైతులకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో ఈ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందుబాటులోకి వస్తాయని అదే సమయంలో విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని చుంచుపల్లిలో ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు కూడా ప్రయోజనం కలిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావడంతో పాటు విజయ మినీ పాల శీతలీకరణ కేంద్రాన్ని చుంచుపల్లిలో ఏర్పాటు చేసే పనులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.ఈ పరిశీలనలో లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, విజయ డెయిరీ మేనేజర్ సౌజన్య, సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ ఆధ్వర్యంలో బాపట్లలో రైతు భరోసా పాదయాత్ర

**బాపట్ల : సెప్టెంబర్ 10 ( ప్రజా వీక్షణం )**

బాపట్ల నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన మూడు రోజులు జరిగే పాదయాత్రలో మనోధైర్యం ఇవ్వడానికి బాపట్ల ముద్దుబిడ్డ, రైతుబిడ్డ, బాపట్ల మాజీ శాసనసభ్యులు కోన రఘుపతి రైతు భరోసా పాదయాత్రను ప్రారంభించారు.మొదటి రోజు బాపట్ల మండలం పరిధి వరకు ఈ పాదయాత్ర జరిగింది.బాపట్ల రైతులను వెంటనే ఈ కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ శ్రీ కోన రఘుపతి గారు డిమాండ్ చేశారు.అదేవిధంగా రైతులకు మంచి జరగాలని,వర్షాలు పడాలని శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్, బాపట్ల మాజీ శాసనసభ్యులు బాపట్ల వైసిపి ఇన్చార్జ్ కోన రఘుపతి సర్వమత ప్రార్ధనలు చేయించారు.మొదటిరోజు జరిగిన రైతు భరోసా పాదయాత్ర కార్యక్రమంలో,రైతులు,కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు,, మరియు రైతులకు మద్దతుగా వైసిపి నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమానికి అత్యధికంగా హాజరై రైతులకు సంఘీభావంగా పాదయాత్రలో పాల్గొన్నారు.



# అంగన్వాడీ పాఠశాలలో పలకలు అందజేసిన రజని

**బాపట్ల : సెప్టెంబర్ 10 ( ప్రజా వీక్షణం )**

బాపట్ల మండలం రామ్ నగర్ లో ఉన్న అంగన్వాడీ పాఠశాలలో గురువారం సామాజిక సేవకురాలు బండ్రెడ్డి రజని పిల్లలకు పలకలు,బలపములు మరియు అల్పాహారంను అందజేశారు.అదే విధంగా పిల్లల సౌకర్యార్థం రెండు సిరి చాపలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు,పిల్లల తల్లులు,పిల్లలు పాల్గొన్నారు.



# ఆదివాసి బిడ్డ ఉకే శిరీష హత్యకు కారణమైన రాక్షసుడిని ఎన్‌కౌంటర్ చేయాల్సిందే:....మాజీ ఎంపీ సోయం వీరభద్రం






## ప్రైమ్ కేర్ హాస్పిటల్‌ను తక్షణమే సీజ్ చేయాలి.. బాధిత కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి

## లిఆదివాసి గిరిజన నర్సు ఉకే శిరీష పెద్దకర్మలో నివాళులు అర్పించిన మాజీ ఎంపీ సోయం వీరభద్రంలిమరియు మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వరులు

**ములకలపల్లి, సెప్టెంబర్ 10:(ప్రజా వీక్షణం)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటిగూడెం గ్రామంలో ఆదివాసి యువ నర్సు ఉకే శిరీష పెద్దకర్మ కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తత, భావోద్వేగాల నడుమ కన్నీరుమున్నీరుగా సాగింది. అన్యాయంగా బలిగొనబడిన ఆ ఆదివాసి బిడ్డ సమాధి వద్ద, చిత్రపటానికి జిల్లా ఆదివాసి నాయకులు, మాజీ ఎంపీ సోయం వీరభద్రం, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, ఆదివాసి జాక్ చైర్మన్ చుంచు రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గుండెలు పగిలి రోదిస్తున్న శిరీష కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. శిరీషకు పూర్తి న్యాయం జరగాలని డిమాండ్ చేస్తూ గత 7 రోజులుగా నిరసన పాదయాత్ర చేస్తున్న ఆదివాసి తెగల చైర్మన్ చుంచు రామకృష్ణ బృందానికి సోయం వీరభద్రం సంపూర్ణ మద్దతు ప్రకటించారు.?ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై సోయం వీరభద్రం తీవ్ర స్థాయిలో అగ్గిమీద గుగ్గిలమయ్యారు. రాష్ట్రంలో 'ప్రజాపాలన' అని చెప్పుకుంటూనే, అభం శుభం తెలియని మహిళలపై హైదరాబాద్ నడిబొడ్డున అరాచకాలు, హత్యాకాండలు జరుగుతున్నా ఈ ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారిపోయాయని, హోమ్ మంత్రి లేకుండా ప్రభుత్వాన్ని నడుపుతూ అమాయకుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ధ్వజమెత్తారు.?శిరీష మృతికి కారణమైన కిరాతకుడు సనావుల్లాఖాన్‌ను వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలని, అప్పుడే ఆ తల్లి ఆత్మకు శాంతి కలుగుతుందని హెచ్చరించారు. ఈ దారుణానికి అండగా ఉన్న ప్రైమ్ కేర్ హాస్పిటల్ యజమాన్యాన్ని తక్షణమే అరెస్ట్ చేసి ఆసుపత్రిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న ఆదివాసి యువతిని పొట్టనబెట్టుకున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం ఆపేది లేదని స్పష్టం చేస్తూ... బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కోటి రూపాయల నష్టపరిహారంతో పాటు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.?ఈ కార్యక్రమంలో అలెం కోటి, కొడెం వెంకటేశ్వర్లు, వాడే నాగరాజు, కీసరి రాంబాబుతో పాటు తుడుందెబ్బ ఆదివాసి హక్కుల పోరాట సమితి నాయకులు, పెద్ద సంఖ్యలో గిరిజనులు, మహిళలు పాల్గొన్నారు.

# వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి..

## డీజే లకు అనుమతి లేదు.. పెడితే కఠిన చర్యలు..

## ఎస్సై భాస్కర్ రెడ్డి..

**దేవరకద్ర , సెప్టెంబర్ 10 ప్రజా విక్షణం**



ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి ఉత్సవాలను మండల ప్రజలు ప్రశాంత వాతావరణంలో, ఎలాం టి అవాంఛనీయ సంఘటనలకు తావులే కుండా నిర్వహించేందుకు చర్యలు తీసుకు ంటున్నట్లు ఎస్సై భాస్కర్ రెడ్డి తెలిపారు. గురువారం ప్రజా వి క్షణం విలేఖరితో మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబం ధనలను తప్పనిసరిగా పాటించాలని సూ చించారు. ఉత్సవాల సమయంలో శాంతిభద్ర తలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడవద్దని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. మండపాల వద్ద విద్యుత్ భద్రత, అగ్నిప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.మండపాల ఏర్పాటుకు సంబంధించి అవసరమైన అనుమతులు తీసుకోవాలని, రహదారులకు ఇబ్బంది కలిగించకుండా మండపాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని, అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా నిబంధనలకు అనుగుణంగా సౌండ్ సిస్టమ్ వినియోగించాలని స్పష్టం చేశారు.వినాయక నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనల మేరకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, నిమజ్జన ఊరేగింపులో యువత సంయమనం పాటించాలని అధికారులు సూచించారు. సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్టులు, వదంతులను ప్రచారం చేయవద్దని, అనుమానాస్పద విషయాలు కనిపిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. తదితరులు పాల్గొని ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన భద్రతా చర్యలు, పోలీసుల సూచనలు వివరించారు.ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలు జరుపుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు.

# న్యూయార్క్ 9/11 దాడులకు 25ఏళ్లు...!

## -ఉగ్రదాడులతో వణికిపోయిన న్యూయార్క్ నగరం

అమెరికా న్యూయార్క్ నగరంలో ఉన్న వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై అల్‌ఖైదా ఉగ్రవాదులు దాడులకు దిగారు. నాలుగు విమాన్లను హైజెక్ చేసి ట్విన్ టవర్స్‌ను కూల్చేశారు. 2001 సెప్టెంబరు 11వ తేదీన జరిగిన దాడులతో న్యూయార్క్ నగరం చిగురటాకులా వణికిపోయింది. సెప్టెంబర్11... ఈరోజును ప్రపంచమంతా గుర్తుచేసుకుంటుంది. ఎందుకంటే ఇదేరోజున అమెరికా వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై దాడి జరిగింది. దీంతో ప్రపంచ ప్రజలు ఉలిక్కిపడ్డారు. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై దాడి చేసిన ఉగ్రవాదులు మారణహోమం సృష్టించారు. ఈ దుర్ఘటన జరిగి 25ఏళ్లు గడిచినా.. నేటికి అమెరికన్లే కాదు... ప్రపంచ ప్రజలు కూడా ఈ దుర్ఘటనను మరిచిపోలేరు. అల్‌ఖైదా ఉగ్రమూక విమానదాడులు జరిపి దాదాపు మూడువేల మందిని పొట్టన పెట్టుకున్నారు.అమెరికా న్యూయార్క్ నగరంలో ఉన్న వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై అల్‌ఖైదా ఉగ్రవాదులు దాడులకు దిగారు. నాలుగు విమాన్లను హైజెక్ చేసి ట్విన్ టవర్స్‌ను కూల్చేశారు. 2001 సెప్టెంబరు 11వ తేదీన జరిగిన దాడులతో న్యూయార్క్ నగరం చిగురటాకులా వణికిపోయింది. ఉగ్రదాడితో వరల్డ్ ట్రేడ్ సెంటర్స్ ట్విన్ టవర్స్ నేలకూలాయి. ఈ దాడుల్లో సుమారు మూడువేల మంది చనిపోగా... మరో ఆరువేల మంది గాయాలపాలయ్యారు. 9/11దాడులతో మనదేశ వాణిజ్య రాజధాని ముంబై సహా అనేక దేశాల్లో పలు కీలక నగరాల్ని అమెరికా విదేశాంగ శాఖ అప్రమత్తం చేసింది. దేశవ్యాప్తంగా రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు, అణుకేంద్రాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.అమెరికా న్యూయార్క్ నగరంలో వరల్డ్ ట్రేడ్ సెంటర్ టవర్లపై ఉగ్రవాదులు జరిపిన దాడికి నేటితో 25ఏళ్లు పూర్తయ్యాయి. అందుకే సెప్టెంబర్ 11 అంటే చాలు అమెరికన్లు ఉలిక్కిపడుతుంటారు. అల్‌ఖైదా ఉగ్రవాదులు సృష్టించిన ఈ భీకర విధ్వంసం నుంచి తేరుకోవడానికి అమెరికాకు చాలా ఏళ్లే పట్టింది. అనంతరం ఉగ్రమూకల ఏరివేత చర్యల్లో భాగంగా అమెరికా తమ బలగాల్ని ఆఫ్ఘాన్‌లో మోహరించి ..సరిగ్గా న్యూయార్క్ దాడులు జరిగిన పదేళ్లకు అల్‌ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్‌ను తుదముట్టించింది.

ప్రజావీక్షణం
దినపత్రిక

# మోడల్ పాఠశాల గా ప్రగతి..!

## ఎమ్మెల్యే నరేంద్ర వర్మ వినతి..!!

## కార్పొరేట్ స్థాయిలో బాపట్ల మున్సిపల్ హైస్కూల్!

బాపట్ల : సెప్టెంబర్ 10 ( ప్రజా వీక్షణం )



చరిత్ర కలిగిన బాపట్ల పురపాలక సంఘ ఉన్నత పాఠశాల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఒక నిర్మాణాత్మకమైన కృషి జరుగుతోంది. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా దీన్ని తీర్చిదిద్దాలని ఒక అద్భుతమైన సంకల్పానికి శ్రీకారం చుట్టారు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు. అత్యున్నతమైన విద్యా ప్రమాణాలతో పాటు, అత్యుత్తమ సదుపాయాలు కల్పించేలా కృషి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని నరేంద్ర వర్మ రాజు వెల్లడించారు. నియోజకవర్గ స్థాయి 'మోడల్ స్కూల్'గా ఈ పాఠశాలను తీర్చి దిద్దేలా ప్రణాళికలు రూపొందిస్తు న్నామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వ ం అధికారం లోకి వచ్చిన తర్వాత తొలిసారి గా బాపట్లలోని ఈ పాఠశాలలో 2024 డిసెంబర్ 7వ తేదీన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో విద్యా వ్యవస్థలో నూతన సంస్కరణలకు ఇక్కడి నుండే శ్రీకారం చుట్టారు. అదే ఒరవడిలో ఈ పాఠశాల అభివృద్ధికి నాటినుండి నేటి వరకు అడుగడుగున అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ తెలిపారు. మున్సిపల్ హైస్కూల్‌ను మోడల్ స్కూల్‌గా మార్చాలని, నియోజకవర్గం లోని పిట్టల వాని పాలెం మండలం కొత్తపాలెంలో నూతన ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని, అలాగే పట్టణంలో నూతన ప్రభుత్వ జూనియర్ కాలేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంత్రి నారా లోకేష్ కు విజ్ఞప్తి చేశారు. గతంలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు చేసిన వినతిపై సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్ పాఠశాల ఆధునీకరణ కోసం రూ. 1.48 కోట్ల ప్రత్యేక నిధులను, పీఎం పోషణ్ కింద మరో రూ. 16 లక్షలను మంజూరు చేశారు. ఈ నిధులతో 24 అత్యాధునిక తరగతి గదులు, సువిశాలమైన డైనింగ్ హాల్, మోడరన్ కిచెన్, అధునాతన సైన్స్ ల్యాబ్‌లను నిర్మించారు. తిరిగి తాజాగా మంత్రి లోకేష్ ను కలిసిన బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు ఈ పాఠశాలను మోడల్ పాఠశాలగా తయారు చేయడంలో ప్రభుత్వ సహకారం అవసరమని తెలిపారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందించారు. అవసరమైన నిధులు కేటాయించేందుకు తగిన భరోసా ఇచ్చారు.బాపట్ల నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు, ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేందుకు నిరంతరం సహకారాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ కు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# సర్ ప్రక్రియపై పొలిటికల్ పార్టీలతో ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి సమావేశం

చిలకలూరిపేట : సెప్టెంబర్ 10 ( ప్రజా వీక్షణం )

చిలకలూరిపేట నియోజకవర్గం లో ఓట్లు తొలగింపు పై 6,184 ఓట్లు తొలగించే ప్రమాదం ఉందని పొలిటికల్ పార్టీలకి చిలకలూరిపేట ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి లీలారాణి తెలియజేశారు.గురువారం చిలకలూరిపేట పట్టణంలో తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి లీలారాణి రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పాల్గొన్న నవతరం పార్టీ జాతీయ అధ్యక్షుడు రావు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.....సరైన ధ్రువపత్రాలు సమర్పించి ఓటు హక్కు కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరిబాబు,యడ్లపాడు,నాదెండ్ల తహసీల్దార్లు,నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం,తెలుగుదేశం పార్టీ నుండి అజహార్,వైయస్ఆర్సీపీ పార్టీ నుండి విడదల రవి శాస్త్రి,జనసేన పార్టీ నుండి కోట సాంబ,భారతీయ జనతా పార్టీ నుండి కోట.చంద్రబాబు నాయుడు, కాంగ్రెస్ పార్టీ నుండి ఎం.ప్రసన్న పాల్గొన్నారు.



# బుట్టాయగూడెం విద్యా రోహిణి డిజిటల్ స్కూల్‌లో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ!

## ప్రకృతి పరిరక్షణే ధ్యేయంగా మట్టి వినాయకుల వితరణ

బుట్టాయగూడెం, సెప్టెంబర్ 10:(ప్రజా వీక్షణం)

ప్రకృతిని కాపాడుతూ మన సంస్కృతిని నిలబెట్టాలనే ఉద్దేశంతో ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండల పరిధిలో ఉన్నా విద్యా రోహిణి డిజిటల్ స్కూల్‌లో విద్యార్థిని విద్యార్థులకు పార్థివ గణపతి (మట్టి) ప్రతిమలను పంపిణీ చేయడం జరిగింది. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించి ఆ విఘ్నేశ్వరుని సేవలో తరించాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో కళకళలాడాలని కోరుకుంటూ ఈ కార్యక్రమం చేపట్టారు. గత తొమ్మిది సంవత్సరాలుగా ఈ సత్కార్యాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే, ఈ నెల 17వ తేదీన రానున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా, ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని మరియు ఆయన పరిపాలనలో భారతదేశం ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా భారత్ ప్రజలందరికీ ముందుగా వినాయక చతుర్థి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ కొండేపాటి రామకృష్ణ, భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు కోసూరి నరేష్, బీజేపీ యువ కార్యకర్త నందిన సతీష్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి గుట్ల ధర్మరాజు, యువ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కొండేపాటి సాయి అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ నోటీసులపై నిర్లక్ష్యం చేయ వద్దు..

## తహశీల్దార్ మహ్మద్ హర్షద్..

దేవరకద్ర , సెప్టెంబర్ 10 ప్రజా వీక్షణం



ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న వారు ఎలాంటి జాప్యం చేయకుండా తహశీల్దార్ కార్యాలయంలో హాజరై తదుపరి ప్రక్రియను పూర్తి చేసుకోవాలని స్థానిక తహశీల్దార్ మహమ్మద్ హర్షద్, సూచించా ం ఆయన ప్రజా విక్షణం విలేకరితో మాట్లాడుతూ ఎస్ఐఆర్ నోటీ సులు అందుకున్న వారు నోటీసులో పేర్కొ న్న తేదీ వరకు వేచి చూడాల్సిన అవసరం లేదని, నోటీసులో పేర్కొన్న తేదీ కంటే ముందుగా నేకార్యాలయానికి హాజరై ప్రక్రియను పూర్తిచేసుకోవచ్చునిఆయన తెలిపారు .జాప్యం చేయడం వల్ల తదుపరి అధికారిక ప్రక్రియల్లో ఆలస్యం జరిగే అవకాశం ఉందన్నారు.నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరూ సంబంధిత బీఎల్ఓతో కలిసి నేరుగా తహశీల్దార్ కార్యాలయంలో హాజరై అవసరమైన ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసుకోవాలని ఆయన కోరారు.

# వైసీపీ నాయకుల రైతు భరోసా పాదయాత్ర రాజకీయ లబ్ది కోసమే

కర్లపాలెం ( బాపట్ల ) : సెప్టెంబర్ 10 ( ప్రజా వీక్షణం )




బాపట్లలో వైసీపీ నాయకులు రైతుల కోసం పాదయాత్ర చేస్తున్నాం అంటున్నారు. ఎందుకండీ మీరు చేసే పాదయాత్ర మీ రాజకీయ లబ్ధి కోసం అని ప్రజలందరికీ తెలుసు సార్. నిజంగా మీకు రైతులు మీద చిత్తశుద్ధి ఉంటే వైసిపి ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు వెళ్లి మాట్లాడండి.ఎందుకంటే ప్రజాధనం జీతాలు తీసుకుంటున్నారుగా ఎవరి అబ్బా సొమ్ము సార్ అది.రండి అసెంబ్లీకి లేదా రాజీనామాలు చేయండి మీరు చేసే ప్రతి పని ప్రజలు అందరూ గమనిస్తున్నారు .మళ్లీ మీకు ఓటుతోనే సమాధానం చెబుతారు ప్రజలు.ఆ విషయం వైసీపీ నాయకులు గుర్తుపెట్టుకోవాలి.ఈరోజు బాపట్ల అంటే అభివృద్ధి,అభివృద్ధి అంటే బాపట్ల అనే నినాదంతో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అడుగులు ముందుకు వేస్తున్నారు.ఎక్కడికి వెళ్లినా అక్కడ ప్రజలు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజుకి బ్రహ్మరథం పడుతున్నారు అని మాజీ ఎంపీటీసీ గొర్రుముచ్చు మీరయ్య,టీడీపీ నాయకులు షేక్ సుభాని అన్నారు.

# కష్టాలు తాత్కాలికం.. జీవితం అమూల్యం

## ఆత్మహత్యపై ఆలోచనా విధానాన్ని మార్చుకుందాం : డా. స్రితా కొవ్వూరి

తాడేపల్లిగూడెం ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రజా వీక్షణం)

జీవితంలో ఎదురయ్యే సమస్యలు, కష్టాలు తాత్కాలికమైనవని, ప్రతి మనిషి జీవితం ఎంతో విలువైనదని గుర్తించి ఆత్మహత్యలపై ఆలోచనా విధానాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ మోటివేషన్ స్పీకర్, న్యూరోసైకియాట్రీ నిపుణురాలు డా. స్రితా కొవ్వూరి సూచించారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం--2026 సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్‌లో ఆత్మహత్యపై మన ఆలోచనా విధానాన్ని మార్చుకుందాం అనే అంశంపై గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. అశోక్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి డా. స్రితా కొవ్వూరి మాట్లాడుతూ విద్యార్థులకు ఎదురయ్యే ఒత్తిడి నిర్వహణ, మానసిక ఆరోగ్యం, నిరాశను అధిగమించే మార్గాలపై అవగాహన కల్పించారు. .జీవితంలో ఎదురయ్యే ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని చెప్పారు. కష్టాలు శాశ్వతం కాదని, వాటిని ఎదుర్కొనే ధైర్యం ఉండాలని సూచించారు. మనకు లభించిన జీవితం ఎంతో అమూల్యమైనదని, విద్యార్థులు తమ జీవితానికి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, క్రమశిక్షణ, పట్టుదలతో వాటి సాధనకు కృషి చేయాలని సూచించారు.విద్యార్థులు మొబైల్ ప్రపంచానికే పరిమితం కాకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంతో ప్రత్యక్ష సంబంధాలను పెంపొందించుకోవాలని తెలిపారు. ఒంటరిగా బాధపడకుండా తమ మనసులోని భావాలను నమ్మకమైన వ్యక్తులతో పంచుకోవాలని, అవసరమైన సమయంలో సహాయం కోరడంలో ఎలాంటి సంకోచం చూపకూడదని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ అశోక్ మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యా ఒత్తిడి, ఆందోళన, నిరాశ, వ్యక్తిగత సమస్యలు, భావోద్వేగ సవాళ్లపై అవగాహన కల్పించారు. సమస్యలను ప్రతికూలంగా కాకుండా సానుకూల దృక్పథంతో ఎదుర్కొనే ఆత్మవిశ్వాసాన్ని విద్యార్థుల్లో పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. అనంతరం విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం డా. స్రితా కొవ్వూరిని సాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.




# విద్యార్థులు చదువుకుంటేనే బంగారు భవిష్యత్..

## లక్ష్మీపల్లి గ్రామ సర్పంచ్ పెద్దమోని లక్ష్మీ ఆంజనేయులు..

## విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ..

దేవరకద్ర, సెప్టెంబర్ 10 ప్రజావిక్షణం

విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరవుతూ క్రమశిక్షణతో చదువుకుంటేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని దేవరకద్ర మండలం లక్ష్మీ పల్లి గ్రామ సర్పంచ్ పెద్ద మోని లక్ష్మీ ఆంజనేయులు అన్నారు. దేవరకద్ర మండల పరిధిలోని లక్ష్మీ పల్లి ప్రాథమిక పాఠశాల లో గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన ఏకరూప దుస్తులను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కల్పన అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచ్ లక్ష్మీ ఆంజనేయులు ముఖ్య అతిథి గా హాజరై మాట్లాడుతూ విద్యా ర్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకోవాలని కోరారు. ప్రభు త్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య నందించేందుకు ప్రభుత్వ ప రంగా అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు గుణాత్మకమైన విద్యతో పాటు అక్షయపాత్ర ద్వారా మంచి పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు, రెండు జతల ఏకరూప దుస్తులు, బూట్లు, బెల్టు లు సైతం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోని విద్యలో మరింతగా రాణించాలని కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు లయన్ అశ్విని చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై విద్యాబుద్ధులు నేర్చుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద లు వెంకటేశ్వర్ రెడ్డి, పెద్ద మోని ఆంజనేయులు, సాయిలు, చంద్రమ్మ, హెచ్ యం కల్పన, ఉపాధ్యాయులు అశ్విని చంద్ర శేఖర్, విజయ లక్ష్మీ, నాగేశ్వర్ రెడ్డి,వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.




# వైసీపీ నాయకుల రైతు భరోసా పాదయాత్ర రాజకీయ లబ్ది కోసమే

కర్లపాలెం ( బాపట్ల ) : సెప్టెంబర్ 10 ( ప్రజా వీక్షణం )



బాపట్లలో వైసీపీ నాయకులు రైతుల కోసం పాదయాత్ర చేస్తున్నాం అంటున్నారు. ఎందుకండీ మీరు చేసే పాదయాత్ర మీ రాజకీయ లబ్ధి కోసం అని ప్రజలందరికీ తెలుసు సార్. నిజంగా మీకు రైతులు మీద చిత్తశుద్ధి ఉంటే వైసిపి ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు వెళ్లి మాట్లాడండి.ఎందుకంటే ప్రజాధనం జీతాలు తీసుకుంటున్నారుగా ఎవరి అబ్బా సొమ్ము సార్ అది.రండి అసెంబ్లీకి లేదా రాజీనామాలు చేయండి మీరు చేసే ప్రతి పని ప్రజలు అందరూ గమనిస్తున్నా రు.మళ్లీ మీకు ఓటుతోనే సమాధానం చెబుతారు ప్రజలు.ఆ విషయం వైసీపీ నాయకులు గుర్తుపెట్టుకోవాలి.ఈరోజు బాపట్ల అంటే అభివృద్ధి,అభివృద్ధి అంటే బాపట్ల అనే నినాదంతో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అడుగులు ముందుకు వేస్తున్నారు.ఎక్కడికి వెళ్లినా అక్కడ ప్రజలు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజుకి బ్రహ్మరథం పడుతున్నారు అని మాజీ ఎంపీటీసీ గొర్రుముచ్చు మీరయ్య,టీడీపీ నాయకులు షేక్ సుభాని అన్నారు.

# పెన్షన్ల పేరుతో పేదలకు చుక్కలు... ప్రూఫ్స్ లేవని కోత పెడుతున్నారు!

## -- సిపిఎం నాయకులు గూడెల్లి వెంకటరావు ఆగ్రహం

టీ నర్సాపురం:సెప్టెంబర్ 10(ప్రజా వీక్షణం)



పేదలకు అందాల్సిన పెన్షన్లను కఠినమైన నిబంధనల పేరుతో ప్రభుత్వం ఎగ్గొట్టాలని చూస్తోందని సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ సభ్యులు గూడెల్లి వెంకటరావు విమర్శించారు. టీ నర్సాపురంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.పెన్షన్ వస్తుందని సంతోషపడుతున్న వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులకు ప్రభుత్వ రూల్స్ చూశాక నిరాశే మిగులుతోందని ఆయన అన్నారు. అధికారులు అడుగుతున్న డాక్యుమెంట్లు ఇవే: పెన్షన్ కోసం రకరకాల పత్రాలు కావాలని అడుగుతున్నారని, అన్నీ ఎలా తేవాలని పేదలు వాపోతున్నారని వెంకటరావు తెలిపారు .ఆధార్ కార్డు, రేషన్ కార్డుకుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు (అప్డేట్ హిస్టరీతో సహా) ఓటర్ కార్డు, గ్యాస్ బుక్కు, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్సు ఇంటి పన్ను రసీదులు, కరెంట్ బిల్లులు పేదలు పడుతున్న అసలు ఇబ్బందులు: ఒంటరి మహిళల సమస్య: భర్త వదిలేసినా, విడాకులు తీసుకోకుండా ఒంటరిగా బతుకుతున్న మహిళలు చాలామంది ఉన్నారు. వీరు విడాకుల సర్టిఫికెట్ లేదా పెళ్లి కాలేదనే సర్టిఫికెట్ తెవాలని ప్రభుత్వం అంటోంది. భర్త విడాకులు ఇవ్వకపోతే వీరు ఆ సర్టిఫికెట్లు ఎక్కడి నుంచి తెస్తారు సొంత ఇల్లు లేనివారి గోడు : ఇల్లు, కరెంట్ లేని పేదలు... ఇంటి పన్ను రసీదులు, కరెంట్ బిల్లులు ఎక్కడి నుంచి తెచ్చి ఇవ్వాలి ప్రభుత్వానికి సిపిఎం డిమాండ్: నిబంధనల పేరుతో అర్హులైన పేదల పొట్ట కొట్టవద్దు. ఎలాంటి ప్రూఫ్స్ అడ్డంకులు పెట్టకుండా, నిజంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

ప్రజావీక్షణం దినపత్రిక

GENERAL NEWS

11 శుక్రవారం సెప్టెంబర్ 2026

7

www.prajaveekshanam.in

# మానవత్వానికి నిలువెత్తు రూపం కొల్లూరు సత్తిబాబు దంపతులు..

# అరుదైన వ్యాధితో పోరాడుతున్న నిరుపేద మహిళకు ఆర్థిక చేయూత!

కొయ్యలగూడెం, సెప్టెంబర్ 10 (ప్రజా వీక్షణం):

కష్టంలో ఉన్న తోటి మనిషిని ఆదుకోవడమే నిజమైన మానవత్వం. ఈ నిజాన్ని ఆచరించి చూపుతున్నారు కొయ్యలగూడెం గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, సంఘసంస్కర్త కొల్లూరు సత్తిబాబు దంపతులు. కోట్ల మందిలో ఒకరికి మాత్రమే వచ్చే అత్యంత అరుదైన రక్తనాళాల వ్యాధితో బాధపడుతున్న ఓ నిరుపేద మహిళకు ఆర్థిక సాయం అందించి వారు ఆపద్బాంధవులుగా నిలిచారు. కొయ్యలగూడెం గ్రామానికి చెందిన పందెల్ల మణి అనే మహిళ ప్రస్తుతం తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్యుల పరిశీలన ప్రకారం ఆమెకు సోకిన వ్యాధి సాధారణమైనది కాదు. కోట్ల మందిలో కేవలం ఒక్కరికి మాత్రమే సోకే అరుదైన రక్తనాళాల సమస్యతో ఆమె ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. శరీరంలో రక్తనాళాలు ఉబ్బిపోయి విపరీతమైన నొప్పితో ఆమె అల్లాడిపోతున్నారు. నిరుపేదరికంలో మగ్గుతున్న ఆ కుటుంబానికి పూట గడవడమే కష్టంగా మారింది. అలాంటిది లక్షలు ఖర్చు పెట్టి పెద్ద ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవడం ఆ భార్యాభర్తల ఆర్థిక పరిస్థితికి ఎంతో దూరం. సరైన వైద్యం అందక మణి రోజురోజుకూ క్షీణిస్తుండటంతో, ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో దాతల సహాయం కోసం ఎదురుచూడసాగింది. ఈ విషయం తెలుసుకున్న కొల్లూరు సత్తిబాబు దంపతులు వెంటనే స్పందించారు. మానవతా దృక్ప థంతో బాధితురాలి ఇంటికి వెళ్లి, వారి కుటుంబాన్ని ఓదార్చారు. ఎలాంటి భయపడ వద్దని భర్త పుల్లయ్యకు ధైర్యం చెప్పారు. ఆ వెంటనే మణి వైద్యం కోసం భర్త పుల్లయ్య చేతుల మీదుగా రూ. 5,000/- నగదును అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. కష్టకాలంలో తమను ఆదుకోవడానికి దేవుడిలా వచ్చిన సత్తిబాబు దంపతులను చూసి ఆ భార్యాభర్తలు భావోద్వేగానికి గురయ్యారు. బాధితురాలి భర్త పందెల్ల పుల్లయ్య విలేకరులతో మాట్లాడుతూ.. "మా కష్ట సమయంలో కొల్లూరు సత్తిబాబు దంపతులు వచ్చి ఆర్థిక సాయం అందించారు. వారు మా కుటుంబానికి చేసిన ఈ ఉపకారాన్ని ఎప్పటికీ మచిపోలేం. వారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు" అని కన్నీటిపర్యంత మయ్యారు. అలాగే, తన భార్య ప్రాణాలు నిలబెట్టడానికి ఈ ఐదు వేల రూపాయలే కాకుండా, ఇంకా చాలా ఖర్చు అవుతుందని తెలిపారు. దయగల దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు అందరూ ముందుకు వచ్చి తమకు ఆర్థిక చేయూత అందించాలని ఆయన చేతులు జోడించి వేడుకున్నారు. ఇలాంటి ఆపత్కర సమయంలో తోటివారికి సాయం చేయడం ద్వారా కొల్లూరు సత్తిబాబు దంపతులు అందరికీ ఆదర్శంగా నిలిచారు. పందెల్ల మణి వైద్యం కోసం సాయం చేయదలచిన దాతలు కొయ్యలగూడెంలోని స్థానిక పెద్దలను లేదా బాధితుడు పుల్లయ్యను నేరుగా సంప్రదించి, తమ వంతు సాయాన్ని అందించాలని కోరుతున్నారు.



# విత్తనాల వివరాల నమోదు ప్రక్రియను ఈనెల 15 వరకు పూర్తి చేసుకోవాలి..

## వ్యవసాయ అధికారి రాజేంద్ర అగర్వాల్..

దేవరకద్ర సెప్టెంబర్ 10 ప్రజా వీక్షణం



రైతులు విత్తనాల నమోదు మరియు ధృవీకరణకు సంబంధించి ముఖ్య సమాచారం రైతులందరూ తమకు సంబంధించిన విత్తనాల వివరాల నమోదు ప్రక్రియను ఈనెల 15 వరకు పూర్తి చేసుకోవాలి అని వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. రైతుల ఎంట్రీలు మరియు సంబంధిత అధికారుల ధృవీకరణ కోసం చివరి తేదీని సెప్టెంబర్ 15వ తేదీ వరకు పొడిగించడం జరిగింది అని ఆయన తెలిపారు. కావున రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, సెప్టెంబర్ 15వ తేదీలోపు తమ వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

# ప్రముఖులు బండ్రెడ్డి గంగా మోహన్ హఠాన్మరణం.. టి. నర్సాపురంలో తీవ్ర విషాదం!

### గుండెపోటుతో ఆకస్మిక మృతి చెందిన ప్రముఖ ఎరువుల దుకాణ యజమాని

### కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు, స్థానిక రైతులు

### పెద్ద ఎత్తున తరలివచ్చి భౌతికకాయానికి ఘన నివాళులర్పించిన ప్రముఖులు

టి. నర్సాపురం సెప్టెంబర్ 10(ప్రజా వీక్షణం)



ఏలూరు జిల్లా టి. నర్సాపురం మండలంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మండల ప్రముఖులు, స్థానిక ఎరువుల దుకాణ యజమాని మరియు రైతు అయిన బండ్రెడ్డి గంగా మోహన్ (56) బుధవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం సాయంత్రం వరకు ఎంతో చురుకుగా విధుల్లో ఉన్న ఆయన, సాయంత్రం ఛాతీలో నొప్పిగా ఉందని చింతలపూడిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. గంగా మోహన్ మరణ వార్త తెలిసిన వెంటనే ఆయన స్వగ్రామమైన గురవాయిగూడెం, టి. నర్సాపురం మండలంలోని పలు గ్రామాల నుండి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు, రైతులు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బండ్లచర్ల రోడ్డులోని సినిమా సెంటర్ వద్ద గల ఆయన స్వగృహానికి చేరుకుని, గంగా మోహన్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. శోకసంద్రంలో మునిగిపోయిన ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. అందరితో ఎంతో స్నేహభావంగా, కలుపుగోలుగా ఉండే మోహన్ ఆకస్మిక మరణం అందరినీ కలచివేసింది. ఆయన మృతితో ఈ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



# ఊకె శిరీష మృతికి కారణమైన నిందితులకు ఉరిశిక్ష వేయాలి: మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య డిమాండ్





చవిటిగూడెం సెప్టెంబర్ 10(ప్రజా వీక్షణం)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలోని చవిటిగూడెం గ్రామంలో సంచలనం సృష్టించిన ఊకె శిరీష దిశదిన (పెద్దకర్మ) కార్యక్రమం తీవ్ర ఉద్విగ్న వాతావరణంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఇల్లందు మాజీ ఎమ్మెల్యే, సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు గుమ్మడి నరసయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత శిరీష చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ శిరీష మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమె మరణం కేవలం ఒక కుటుంబానికి మాత్రమే కాకుండా, సమాజానికే తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. శిరీష మృతికి కారణమైన నిందితులకు చట్టపరంగా కఠినమైన ఉరిశిక్ష పడేలా రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శిరీష మృతిపై ప్రజల నుంచి మరియు కుటుంబ సభ్యుల నుంచి వస్తున్న తీవ్ర ఆరోపణలపై పోలీసులు ఎలాంటి ఒత్తిళ్లకు తలవంచకుండా, ఏమాత్రం పక్షపాతం లేకుండా సమగ్రమైన దర్యాప్తు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ దారుణ ఘటనకు బాధ్యులైన ఆసుపత్రి యాజమాన్యం తీరును ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. వారిపై కూడా చట్టపరంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శిరీష కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు మరియు దోషులకు శిక్ష పడే వరకు సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ అండగా ఉంటుందని, అవసరమైతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు నూపా భాస్కర్, జాటోత్ కృష్ణ, ప్రసాద్, సంయుక్త మండల కార్యదర్శి కోర్సా రామకృష్ణ, మండల నాయకులు నకిరికంటి నాగేశ్వరరావు, నూపా సరోజిని, ఎర్రగొర్ల రామారావు, శాస్త్రబోయిన వెంకటేశ్వర్రావు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిరీష చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు తగిన చర్యలు చేపట్టగా, శిరీష దిశదిన కార్యక్రమం సందర్భంగా చవిటిగూడెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# స్థానిక ఎన్నికల్లో జనసేన జైత్రయాత్రకు కేడర్ సిద్ధం కావాలి

## నూరుశాతం విజయమే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలి: పుల్లా బాబి

తాడేపల్లిగూడెం ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రజా వీక్షణం)





రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేసే ప్రతి స్థానంలో విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని జనసేన పెంటపాడు మండల అధ్యక్షుడు పుల్లా బాబి పిలుపునిచ్చారు. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఐక్యంగా కృషి చేయాలని సూచించారు. పెంటపాడు మండలంలోని పెంటపాడు గ్రామం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గురువారం సాయంత్రం నిర్వహించిన జనసేన మండల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి పుల్లా బాబి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రగతిలో జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం మండలంలో జనసేన పార్టీ బలంగా ఉన్న స్థానాలను గుర్తించి, ఆయా స్థానాల్లో పార్టీ తరఫున అభ్యర్థులను బరిలోకి దింపుతామని తెలిపారు. పోటీ చేసే ప్రతి అభ్యర్థి విజయానికి నాయకులు, కార్యకర్తలు బాధ్యత తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ను 62 వేల మెజార్టీతో గెలిపించిన స్ఫూర్తితో స్థానిక ఎన్నికల్లోనూ జనసేన అభ్యర్థులను ఘన విజయం సాధించేలా పనిచేసి, ఆ విజయాన్ని జనసేన బాహుబలి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు కానుకగా అందించాలని పుల్లా బాబి పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ద్వారకాతిరుమల దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు కసిరెడ్డి మధులత మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేలా గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని కార్యకర్తలను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల పరిషత్ అధ్యక్షురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విజయవంతంగా ముందుకు సాగడంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రతిపాదించిన అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొవ్వూరి లక్ష్మణరెడ్డి, కొనకళ్ల హరినాథ్, కృష్ణప్రసాద్, మట్ట సత్యనారాయణ, కొణతాల వెంకట్రావు, చెరుకూరి జగత్ సోమశేఖర్, దాసరి శ్రీనివాస్, నాగరాజు తదితరులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నకిలీ ప్లెడ్జ్ పత్రాలతో రూ.59.30 లక్షల మోసం

## ఇద్దరు నిందితుల అరెస్ట్: ఇన్‌స్పెక్టర్ మచ్చ శివ కుమార్

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 10 (ప్రజా వీక్షణం న్యూస్)

నకిలీ బంగారం తాకట్టు పత్రాలు సృష్టించి గోల్డ్ ఫైనాన్స్ సంస్థను రూ.59. 30 లక్షలకు మోసం చేసిన కేసులో ఇద్దరు నిందితుల ను హనుమకొండ పోలీసు లు అరెస్ట్ చేశారు. ఎలిమి సంతోష్ (37), శ్రీమాన్ కో- ఆపరేటివ్ క్రెడిట్ యూని యన్ చైర్మన్ కమ్ సీఈఓ, వడ్డేపల్లి రంజిత్ (39), వ్యాపారిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మచ్చ శివ కుమార్ తెలిపారు. ఇద్దరూ కలిసి రంజిత్‌కు చెందిన సుమారు 640 గ్రాముల బంగారం శ్రీమాన్ యూని యన్‌లో తాకట్టు ఉన్నట్లు నకిలీ ప్లెడ్జ్ రసీదు సృష్టిం చారు. దానిని నమ్మిన గోల్డ్ ఫైనాన్స్ సంస్థ ప్రతినిధి బంగారాన్ని ప్రత్యక్షంగా పరిశీలించకుండానే రూ. 59.30 లక్షలను యూని యన్ ఖాతాకు ఆర్టీజీఎస్ ద్వారా బదిలీ చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసులో నిందితుల మొబై ల్ ఫోన్లు, నకిలీ ప్లెడ్జ్ పత్రా న్ని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. ఈ వ్యవ హారంలో మరెవరైనా ఉన్నారా, ఇదే తరహాలో ఇతర సంస్థలను మోసం చేశారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. బంగారం తాకట్టు విషయం లో ప్రత్యక్షంగా ధృవీకరిం చిన తర్వాతే ఆర్థిక లావా దేవీలు జరపాలని పోలీ సులు సూచించారు.



ప్రజావీక్షణం
దినపత్రిక

# పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

## జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 10 (ప్రజా వీక్షణం న్యూస్)**

జిల్లాలో పరిశ్రమల స్థాపన కు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుందని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. గురువా రం కుడా కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో DIPC, TG-iPASS కమిటీ సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమల స్థాపనకు సంబంధించిన అనుమతులు,TG-iPASS దరఖాస్తులను సమీక్షించి అర్హత కలిగిన యూనిట్లకు ఆమోదం తెలిపారు. T-PRIDE కింద ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు సరకు రవాణా వాహనాలపై ప్రోత్సాహకాల దరఖాస్తు లను పరిశీలించి, నిబంధన ల మేరకు ఉన్న వాటికి ప్రోత్సాహకాలు మంజూరు చేశారు. సంబంధిత శాఖ లు అనుమతులను త్వరి తగతిన జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.



# ఎస్ఐఆర్ క్లైయిమ్స్, అభ్యంతరాల గడువు పెంపు అదనపు కలెక్టర్ ఎన్.రవి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 10 (ప్రజా వీక్షణం న్యూస్)**

ఎస్ఐఆర్ ప్రక్రియలో క్లైయి మ్స్, అభ్యంతరాల స్వీకర ణ గడువును అక్టోబర్ 7 వరకు, వాటి విచారణ గడువును నవంబర్ 5 వరకు ఎన్నికల సంఘం పొడిగించినట్లు హనుమ కొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి తెలిపారు. తుది ఓటర్ల జాబితా నవం బర్ 9న విడుదల కానుం దని పేర్కొన్నారు. గురు వారం కలెక్టరేట్‌లో రాజ కీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశం లో ఎస్ఐఆర్ ప్రక్రియపై వివరాలు వెల్లడించారు. నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలో ఉండి నోటీ సులు అందుకున్న ఓటర్లు నోటీసులో పేర్కొన్న తేదీ, ప్రదేశంలో విచారణకు హాజరై ఈసీఐ సూచించిన ధ్రువపత్రాలను సమర్పిం చాలని సూచించారు.పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలోని 1,32,070 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయగా, ఇప్పటి వరకు 39,996 మందికి విచారణ పూర్తయిందని తెలిపారు. మిగిలిన వారికి కూడా నోటీసుల ప్రకారం విచారణకు హాజరై అవ సరమైన పత్రాలు సమర్పిం చాలని అదనపు కలెక్టర్ కోరారు.



# సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ భూమిని కేటాయించాలి...

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 10 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలోని పెంచికల్‌పేట్ మండల కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం సమీకృత గురుకుల పాఠశాలను మంజూరు చేసింది. ఈ పాఠశాల నిర్మాణానికి సుమారు రూ.200 కోట్ల ప్రజాధనాన్ని ప్రభుత్వం వెచ్చిస్తోంది.కావున, పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో మంజూరైన ఈ సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి అవసరమైన భూమిని పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్కపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 61లో ఉన్నటువంటి ప్రభుత్వ భూమినీ కేటాయించవచ్చు. అక్కడ ఉన్న ప్రభుత్వ భూమిలో నుంచి 25 ఎకరాల భూమిని తక్షణమే పెంచికలపేట మండలంలో తో పాటు చుట్టు పక్కల మండలాల లోని గ్రామాల నిరుపేద విద్యార్థులందరికీ మరియు మధ్యతరగతి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంధి సమీకృత గురుకుల పాఠశాల సాధన జేఏసీ కన్వీనర్ ఎలగందుల తిరుపతి తెలిగె రమేష్ పుల్లం దమాజీ ఆల్ తెలంగాణ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ సుంపుటం సాయికిరణ్ నిర్వాహిస్తున్నా ఇట్టి దీక్షకు నాలుగో రోజు సమీకృత గురుకుల పాఠశాల సాధన దీక్షకు పెంచికల్‌పేట్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు, సముద్రాల సరిత రాజన్న అధ్వర్యం లో కాంగ్రెస్ పార్టీ పుర్తి మద్దతు తెలిపరు అదేవిధంగ నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పాంధిర్ల నాగులు అధ్వర్యం లో నాయి బ్రాహ్మణ సంఘం పుర్తి మద్దతు తెలిపి తహశీల్దార్ కి వినతిపత్రం అందిచారు ఇంధులో సర్పంచులు చప్పిడి రవీందర్, షేక్ ఉస్మాన్, అల్లూరి రాజేశ్వరి రాజు, కొంద్రా సులోచన భాస్కర్ ఎల్కారి లచన్న కాగజ్‌నగర్ మండల బీజేపీ అధ్యక్షులూ పుల్లా అశోక్ పాల్గొన్నారు



# శక్తి సదన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 10 (ప్రజా వీక్షణం న్యూస్)**

నగరంలోని శక్తి సదన్-- స్వాధార్ గృహ్‌ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ గురువారం ఆక స్మికంగా తనిఖీ చేశారు. గృహంలోని వసతులను పరిశీలించి, ఆశ్రయం పొందుతున్న ఇన్‌మేట్స్‌తో మాట్లాడి వారి సమస్యల ను తెలుసుకున్నారు. అడ్మిషన్స్, స్టాఫ్, అటెం డెన్స్ రిజిస్టర్లతో పాటు ఇతర రికార్డులను పరి శీలించారు. ఇన్‌మేట్స్‌కు అందిస్తున్న కంప్యూటర్, టైలరింగ్ శిక్షణ, భోజనం, తాగునీటి నాణ్యతపై సిబ్బందిని ఆరా తీశారు. చదువులు పూర్తి చేసుకుని స్వయం సమృద్ధి సాధించే లా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. కార్య క్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.విశ్వజ, ఈవో ఆశాదేవి, సూపరింటెండెం ట్ శైలజ తదితరులు పాల్గొన్నారు.






# కాజీపేట బస్‌స్టేషన్ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 10 (ప్రజా వీక్షణం న్యూస్)**

కాజీపేటలో శాశ్వత ఆర్టీసీ బస్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదిత రైల్వే స్థలాల ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం పరిశీలించారు. రైల్వే స్టేషన్ ముందు ఉన్న స్థలం, రైల్వే పాఠశాల, స్టేడియం ప్రాంతం, స్టేడియానికి ఎదురుగా ఉన్న సుమారు ఎకరం భూమిని అధికారు లతో కలిసి పరిశీలించారు.శాశ్వత బస్‌స్టేషన్ నిర్మా ణానికి అవసరమైన భూమి సమకూర్చుకో వడం, రైల్వే శాఖతో భూమి మార్పిడి ప్రక్రియ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరి చేలా చర్యలు తీసుకుంటా మని తెలిపారు. కార్యక్ర మంలో ఆర్టీసీ ఆర్ఎం భవానీ ప్రసాద్, డిప్యూటీ ఆర్ఎం కిషన్‌రావు, డీఎం ధరమ్‌సింగ్, రైల్వే అధి కారులు తదితరులు పాల్గొ న్నారు.



# లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం..

## రాజీయే రాజమార్గం" -- మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి-జిల్లా ఎస్పీ నితికా పంత్, ఐపీఎస్..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 10 (ప్రజా వీక్షణం న్యూస్)**



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో జాతీయ మెగా లోక్ అదాలత్‌ను ఈ నెల 12వ తేదీ శనివారం నిర్వహించనున్న నేపథ్యంలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ కోరారు. రాజీ పడదగిన వివిధ రకాల కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఒక వేదికగా నిలుస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,క్రిమినల్ కంపౌం డబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన వివాదాలు, కుటుంబ మరియు వైవాహిక జీవితానికి సంబంధించిన సమస్యలు,బ్యాంకు రికవరీ కేసులు,విద్యుత్ చౌర్యం కేసులు,చెక్ బౌన్స్ కేసులు తదితర అంశాల్లో ఇరువర్గాలు పరస్పర రాజీ ద్వారా తమ వివాదాలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.చిన్న చిన్న వివాదాలను పెద్ద కక్షలుగా మార్చుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం,ధనం వృథా చేసుకోవద్దని సూచించారు. "రాజీయే రాజమార్గం"అనే భావనతో న్యాయశాఖ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని తమ వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందాలని కోరారు.

# కిట్స్ వరంగల్ తో సెంట్రల్ ఇండియా అవగాహన ఒప్పందం

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 10 (ప్రజా వీక్షణం న్యూస్)**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆవిష్కరణలు, అనుభవ పూర్వక అభ్యాసం, విద్యా ర్థుల నైపుణ్యాభివృద్ధి కోసం కిట్స్ వరంగల్ సీఎస్ ఈ (ఏఐ అండ్ ఎంఎల్) విభాగం, హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ సెంట్రల్ ఇండియా మధ్య అవగాహ న ఒప్పందం కుదిరింది. కిట్స్ కమిటీ హాల్‌లో బుధ వారం ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నా రు. ఈ సందర్భంగా కిట్స్ చైర్మన్ కెప్టెన్ వి.లక్ష్మీకాంత రావు, అదనపు కార్యదర్శి వి.సతీష్‌కుమార్, ప్రిన్సిపా ల్ ప్రొఫెసర్ కె.అశోక్‌రెడ్డి అభినందనలు తెలిపారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల కు ప్రాక్టికల్ లెర్నింగ్, మెంట రింగ్, సాంకేతిక నైపుణ్యా లు అందించడమే లక్ష్య మని సెంట్రల్ ఇండియా సహ వ్యవస్థాపకుడు జి.సాయికృష్ణ తెలిపారు.అక్టోబర్ 10, 11 తేదీల్లో ట్రైసిటీ ఏఐ హ్యాకథాన్ నిర్వహించనున్నట్లు ప్రిన్సి పాల్ అశోక్‌రెడ్డి తెలిపారు. వరంగల్, హనుమకొండ, కాజీపేటకు చెందిన 1,000 మందికి పైగా విద్యార్థులు పాల్గొనే ఈ కార్యక్రమంలో ఏఐ, జనరేటివ్ ఏఐ, ఏజెం టిక్ ఏఐపై వాస్తవ సమస్య ల ఆధారంగా ప్రాజెక్టులు రూపొందించనున్నారు.




# బ్రహ్మోస్ భూ సేకరణ పై రైతులతో జిల్లా కలెక్టర్ చర్చలు..

**దేవరకద్ర సెప్టెంబర్ 10 ప్రజా విక్షణం**

మండల పరిధిలోని బసవయపల్లి గ్రామంలో బ్రహ్మోస్ క్షిపణి తయారీ పరిశ్రమ కోసం భూ సేకరణకై గురువారం జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా రైతులతో చర్చించారు. ఈ ప్రాజెక్టు ఏర్పాటు వల్ల పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుందని ఈ భూములు కోల్పోయే రైతులకు చట్ట ప్రకారం మెరుగైన పరిహారం న్యాయం అందజేస్తామని ఆమె స్పష్టం చేశారు. దీనికి సంబంధించి రైతులు తమ అభ్యంతరాలు మార్కెట్ విలువకు అనుగుణమైన ప్రతిపాదనలు అందజేయాలని సర్వే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆమె అధికారులను ఆదేశించారు.



# అటవీ సంపదను, వన్యప్రాణులను మరియు సహజ పర్యావరణాన్ని కాపాడేందుకు అటవీ శాఖ ఆధ్వర్యంలో రక్షణ చర్యలు..

## కాగజ్ నగర్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్. టి. భార్గవ్ కుమార్ ఐ ఎఫ్ ఎస్...

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 10 (ప్రజా వీక్షణం న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అటవీ సంపదను, వన్యప్రాణులను మరియు సహజ పర్యావరణాన్ని కాపాడేందుకు అటవీ శాఖ ఆధ్వర్యంలో రక్షణ చర్యలను మరింత బలోపేతం చేస్తున్నట్లు కఘజ్నగర్బి డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ భార్గవ్ కుమార్ ఐ ఎఫ్ ఎస్ తెలిపారు.అటవీ ప్రాంతాల్లో అక్రమంగా చెట్ల నరికివేత, అటవీ భూముల ఆక్రమణ, వన్యప్రాణుల వేట మరియు ఇతర అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు నిరంతర పెట్రోలింగ్, రక్షణ గస్తీ, వాహన తనిఖీలు మరియు సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని తెలిపారు.అటవీ సిబ్బంది ప్రతిరోజూ తమ పరిధిలోని అటవీ ప్రాంతాలను పర్యవేక్షిస్తూ, అనుమానాస్పద కార్యకలాపాలపై తక్షణమే చర్యలు తీసుకావాలని. అవసరమైన ప్రాంతాల్లో కెమెరా ట్రాప్స్, మొబైల్ ప్యాట్రోలింగ్ మరియు సాంకేతిక పర్యవేక్షణ వంటి ఆధునిక పద్ధతులను కూడా వినియోగించాలని తెలిపారు.అటవీ సంపదకు నష్టం కలిగించే అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు.వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా వేట నిరోధక చర్యలు, నీటి వనరుల పర్యవేక్షణ, వన్యప్రాణుల కదలికల పరిశీలన కు డ్రోన్స్ వినియోగించాలని ఎఫ్ డి ఓ కాగజ్ నగర్.సిబ్బందికి సూచనలు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎఫ్ ఆర్ ఓ. కాగజ్ నగర్, సిర్పూర్, కార్జెల్లి,బెజ్జూర్, పెంచికల్పేట్ మరియు డి ఆర్ ఓ లు, ఎఫ్ ఎస్ ఓ లు మరియు ఎఫ్ బి ఓ లు పాల్గొన్నారు.






Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com

# ఏలూరులో మానవత్వం చాటుకున్న త్రీ టౌన్ పోలీసులు..

# పోగొట్టుకున్న రూ. 50 వేల నగదు బాధితునికి సురక్షితం!

### సీసీ కెమెరాల సహాయంతో క్షణాల వ్యవధిలో బ్యాగు గుర్తింపు

### కొల్లేటికోట వాసి పాండురంగారావు కష్టార్జితం భద్రం

### పోలీసుల అంకితభావంపై స్థానికులు, బాధితుడి ప్రశంసల వర్షం

ఏలూరు జిల్లా, సెప్టెంబర్ 10:(ప్రజా వీక్షణం)

"రక్షణగా మేమున్నాం" అనే భరోసాని ఏలూరు త్రీ టౌన్ పోలీసులు మరోసారి నిజం చేసి చూపించారు. జీవిత కాలపు కష్టార్జితం, అత్యవసర అవసరాల కోసం తెచ్చిన రూ. 50 వేల నగదు పోయిందని దిక్కుతోచని స్థితిలో రోదించిన ఒక వృద్ధునికి వారు ఆపద్బాంధవులుగా నిలిచారు. బాధితుడు ఏలూరు కొత్త బస్టాండ్‌లో మరిచిపోయిన నగదుతో కూడిన బ్యాగును క్షణాల వ్యవధిలో సీసీ కెమెరాల సహాయంతో గుర్తించి, సురక్షితంగా ఆయన చేతికి అప్పగించి తమ నిజాయితీని, బాధ్యతను చాటుకున్నారు. ఏలూరు జిల్లాలోని ప్రముఖ ప్రాంతమైన కొల్లేటికోట గ్రామానికి చెందిన జయమంగళ పాండురంగారావు అనే 65 సంవత్సరాల వృద్ధుడు వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఉదయం పూట ఏలూరు కొత్త బస్టాండ్‌కు చేరుకున్నారు. ఆయన ప్రయాణపు సరుకులతో పాటు, అత్యవసరంగా ఉపయోగపడే దుస్తులు మరియు కష్టపడి దాచుకున్న రూ. 50,000/- (యాభై వేల రూపాయల) నగదును ఒక ప్రత్యేక బ్యాగులో ఉంచుకున్నారు. అయితే, బస్టాండ్ రద్దడి మధ్యలో ఆయన తన చేతిలోని ఆ బ్యాగును ఒక ప్రదేశంలో ఉంచారు. కొద్దిసేపటి తర్వాత ఆ ప్రాంతం నుండి కదిలిన ఆయన, తాను బ్యాగును ఎక్కడ పెట్టాననే విషయాన్ని పూర్తిగా మరచిపోయారు. చుట్టుపక్కల వెతికిచూసినప్పటికీ ఆచూకీ దొరకకపోవడంతో ఆ వృద్ధునికి ఒక్కసారిగా గుండె గుంమన్నట్లయింది. తన జీవితంలో పొదుపు చేసుకున్న ఆ మొత్తం పోయిందనే ఆందోళనతో ఆయన బస్టాండ్ ప్రాంగణంలో లబోదిబోమంటూ విలపించారు. ఎలాంటి ఆలస్యం చేయకుండా ఆ వృద్ధుడు వెంటనే ధైర్యం తెచ్చుకుని స్థానిక పోలీసులను ఆశ్రయించి తన గోడును వెళ్లబోసుకున్నారు. సహాయం కోసం అర్థం చేసుకున్న బాధితుడి పరిస్థితిని అర్థం చేసుకున్న ఏలూరు 3 టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది క్షణం కూడా వృథా చేయకుండా తక్షణమే స్పందించారు. వెంటనే రంగంలోకి దిగిన సిబ్బంది హుటాహుటిన కొత్త బస్టాండ్‌కు చేరుకున్నారు. కేసు తీవ్రతను గుర్తించిన పోలీసులు, బస్టాండ్‌లో అందుబాటులో ఉన్న సిబ్బందితో పాటు, ఆ ప్రాంతంలోని స్థానిక షాపు యజమాని వెంకటరావును సంప్రదించారు. ఆయన వద్ద ఉన్న సీసీ




కెమెరా (సీసీటీవీ ) ఫుటేజీలను అత్యంత క్షుణ్ణంగా, నిశితంగా పరిశీలించారు. పాండురంగారావు బస్టాండ్‌లో ఎక్కడెక్కడ సంచరించారు, బ్యాగును ఎక్కడ ఉంచారనే కోణంలో కూపీ లాగారు. పోలీసులు ప్రదర్శించిన అప్రమత్తత, సాంకేతిక పరిజ్ఞానపు వాడకం ఫలించాయి. బస్టాండ్ ప్రాంగణమంతా కలియతిరిగి గాలించిన పోలీసులు.. వృద్ధుడు పాండురంగారావు బస్టాండ్‌లో మర్చిపోయిన ఆ బ్యాగును ఎట్టకేలకు విజయవంతంగా గుర్తించారు. ఆ బ్యాగును తెరిచి చూడగా, అందులో ఉండవలసిన దుస్తులతో పాటు రూ. 50,000 నగదు రూపాయి కూడా పోకుండా అలాగే భద్రంగా ఉంది. ఎలాంటి నష్టం, చోరీ జరగకుండా భద్రపరిచిన ఆ బ్యాగును పోలీసులు ఎంతో ఆప్యాయంగా బాధితుడు పాండురంగారావుకు స్వయంగా అందజేశారు. తన పోయిన సొమ్ము తిరిగి తన చేతికి రావడంతో వృద్ధుడు పాండురంగారావు ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. భావోద్వేగంతో ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. వృద్ధుడి కష్టాన్ని అర్థం చేసుకుని, క్షణాల వ్యవధిలో స్పందించి సొమ్మును వెతికిపెట్టిన ఏలూరు 3 టౌన్ పోలీసుల సేవలను, వారి అంకితభావాన్ని బాధితుడితో పాటు అక్కడ ఉన్న స్థానిక ప్రజలు, ప్రయాణికులు వేనోళ్ల కొనియాడారు. సమాజంలో పోలీస్ శాఖ అంటే కేవలం చట్టాన్ని అమలు చేయడమే కాదు, ప్రజల కష్టాల్లో అండగా నిలిచే రక్షక భటులు అని ఈ ఘటన మరోసారి రుజువు చేసిందని పలువురు ప్రశంసించారు. పోలీసుల ఈ మంచి పని పట్ల జిల్లావ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

# నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం

### ప్రజల్లో నడకపై ఆసక్తిని పెంచాలి

### ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ అధ్యక్షురాలు

### డాక్టర్ వనచర్ల విజయలక్ష్మి

తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 10 (ప్రజా వీక్షణం)

నిత్య జీవితంలో నడకను భాగస్వామ్యం చేసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ అధ్యక్షురాలు డాక్టర్ వనచర్ల విజయలక్ష్మి అన్నారు. ప్రజల్లో నడకపై మరింత ఆసక్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని హేమగిరి పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు, మహిళా వాకర్స్ సభ్యులు, ఉపాధ్యాయులు కలిసి గురువారం మారథాన్ వాక్ నిర్వహించారు. విద్యార్థినులు ఆరోగ్య పరిరక్షణ, నిత్య నడక ప్రాధాన్యతను తెలియజేసే ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వనచర్ల విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతిరోజూ కొంత సమయం నడకకు కేటాయించడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. నడకను అలవాటుగా మార్చుకోవడం ద్వారా ఎన్నో ఆరోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ నడకకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుంట్ల కనకదుర్గ, సి. హెచ్. ఇందిరాకుమారి, డి. వెంకటలక్ష్మి, వాకర్స్ ఇంటర్నేషనల్ ఎలెక్ట్ గవర్నర్ వనచర్ల నాగేంద్రప్రసాద్, కుంట్ల రామ్మోహన్‌రావు, ఎం. యోహాన్, అత్తిలి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.




# స్థానిక పోరుకు వైసీపీ శ్రేణులు సిద్ధం కావాలి

### ఎన్నికలు ఎప్పుడొచ్చినా అభ్యర్థుల

### విజయానికి సమిష్టిగా కృషి చేయాలి

### వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ

### సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు

తాడేపల్లిగూడెం ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రజా వీక్షణం)

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఎదుర్కొనేందుకు గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్టంగా సిద్ధం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డి రఘురామ్ నాయుడు పిలుపునిచ్చారు. పెంటపాడు మండలంలోని పడమర విప్పర్రు గ్రామంలో స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, ప్రజా సమస్యలపై పోరాటం, రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త పార్టీకి వెన్నెముకలా పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలతో నిరంతరం మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పోరాడాలని కోరారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, గ్రామస్థాయిలో కార్యకర్తల మధ్య సమన్వయాన్ని మరింత పెంచుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ సాయంతో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ పథకం కింద రూ 20 వేలు ఇస్తామని రైతులను మోసం చేశారని విమర్శించారు. ఆడబిడ్డ నిది కింద ప్రతి ప్రతి మహిళకు నెలకు రూ1500 ఇస్తామనే హామీని తుంగలో తొక్కారన్నారు. ఏడాదికి నాలుగు లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ భృతి కింద రూమ్ రూ 3 వేలు చెల్లిస్తామని నిరుద్యోగ యువతను దారుణంగా మోసం చేశారని ఆరోపించారు ఈ రెండేళ్లలో ఎన్ని లక్షల ఉద్యోగాలు ఇచ్చారో, ఎంతమందికి నిరుద్యోగ భృతి చెల్లించారో కూటమి



నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ అంతా అవకతవకల మయమని, అర్హత లేని వాళ్ళకు కూడా ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఎద్దేవా చేశారు. కూటమి నాయకులు అభివృద్ధిని పక్కన పెట్టి స్వప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తున్న కూటమి ప్రభుత్వ తీరుపై ప్రజలు విసుగు చెందారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని వడ్డి రఘురామ్ నాయుడు పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో పార్టీకి బలమైన పునాది వేసి, ప్రజల విశ్వాసాన్ని మరింత చూరగొనే దిశగా ముందుకు సాగాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కదిలి స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ సీనియర్ నాయకులు కోసూరి వెంకటరాజు, కోసూరు చంటి రాజు, పెంటపాడు మండల అధ్యక్షులు కైకాల శ్రీనివాస్, గ్రామ నాయకులు బోనం వీరయ్య, తెంటూ గోపి, సంపత్ రావు కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు గొర్రెల శ్రీనివాస్, మాకరాజు సతీష్, సబ్బితి బ్రహ్మయ్య, కలిసేటి తాతారావు, రెడ్డి సూరిబాబు, రూరల్ మండల అధ్యక్షులు చిట్టూరి బాపన్న, నల్లమిల్లి అంజిరెడ్డి, బండి నరసింహా, తానేటి అజయ్, గోకా వెంకటేశ్వరరావు, బూడి దుర్గ ప్రసాద్, ద్వారంపూడి కిరణ్ రెడ్డి, చామన సూర్యచంద్రరావు, పునుగు పుల్లయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు వ్యతిరేక చట్టాలపై రైతు ఉద్యమం..

### కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీల అనుకూల

### విధానాలతో రైతు మనుగడ ప్రశ్నార్థకం..

### ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు ఆందోళన..

### ఎల్ ని నో ప్రభావంతో నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకోవాలి.

### ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశం డిమాండ్..

ఉంగుటూరు (కైకరం) సెప్టెంబర్ 10(ప్రజా వీక్షణం)

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న రైతు వ్యతిరేక చట్టాలపై రైతాంగం ఐక్యంగా ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం ఉంగుటూరు మండలం కైకరం లోని గుత్తికొండ వారి సత్రం హాలులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలోని రైతాంగ సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలపై రైతాంగం చారిత్రాత్మక ఉద్యమం చేశారని, ఫలితంగా ఆ చట్టాలను రద్దు చేసి మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చి కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50% కలిపి అన్ని పంటలకు మద్దతు ధరలు నిర్ణయించాలని, ఈ ధరలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కానీ నేడు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీల అనుకూల రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువస్తున్నాయని, దీనితో రైతు మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్ల నియంత్రణ చట్టం, సహకార చట్టం, విత్తన చట్టం, విద్యుత్ సవరణ చట్టం, ప్రకృతి వైపరీత్యాల సహాయ కార్యక్రమాల చట్టం, ఎరువుల విధానం, పంటల బీమా పథకం, డిజిటల్ అగ్రికల్చరల్ మిషన్ ఇలా అనేక చట్టాలు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా మార్చి వేశారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం 25 లక్షల ఎకరాలు రాష్ట్రంలో భూ సేకరణ చేసి కార్పొరేట్ కంపెనీలకు రైతుల భూములను కట్టబెట్టాలని చూస్తోందని, బలవంతపు భూసేకరణ వలన రైతులు నష్టపోతున్నారని చెప్పారు. బలవంతపు భూసేకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావంతో నష్టపోతున్న అన్ని పంటల రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. పాడి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని, పాడిపశువులకు సబ్సిడీపై దాణా అందించాలని కోరారు. కోకో,కొబ్బరి, ఆయిల్ పామ్, పొగాకు, విత్తన రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. రైతాంగ సమస్యలపై దశల వారి ఉద్యమం చేపట్టాలని సమావేశం నిర్ణయించిందని తెలియజేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ కృష్ణారావు, జిల్లా సహాయ కార్యదర్శి కోన శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు గుర్రం రాంబాబు, లావేటి సోంబాబు, బోడిక రామచంద్ర రావు, దాసరి సతీష్, వీరవల్లి భాస్కరరావు, సున్నా వెంకట్రావు, గుండపనేని సురేష్,కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, కో కన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గవర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




# నేర సమీక్షలో పెండింగ్ కేసులపై దృష్టి

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 10 (ప్రజా వీక్షణం న్యూస్)

వరంగల్ పోలీస్ కమిషన రేట్ కార్యాలయంలో గురు వారం కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆధ్వర్యం లో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసుల దర్యాప్తు, నిందితు ల అరెస్టులు, సాక్ష్యాధారా ల సేకరణ, కోర్టు కేసుల పురోగతిపై సమీక్షించారు. నిందితులు పరారీలో ఉంటే ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టి సాంకేతిక పరిజ్ఞానంతో త్వరితగతిన అరెస్టు చేయాలని ఆదే శించారు. మహిళలు, చిన్నారులపై నేరాలు, సైబర్ నేరాలు, ఆస్తి నేరా లు, మాదకద్రవ్యాల కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. గణేష్ నవరాత్రుల సంద ర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు, ముమ్మర పెట్రోలింగ్ చేపట్టాలని ఆదేశించారు. మత్తుపదార్థాల నియంత్ర ణలో ప్రతిభ కనబరిచిన డ్రగ్ కంట్రోల్ అధికారులు, సిబ్బందిని అభినందించి రివార్డులు అందజేశారు. సమావేశంలో డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీ లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.






GENERAL NEWS
11 శుక్రవారం సెప్టెంబర్ 2026
10
www.prajaveekshanam.in
ప్రజావీక్షణం దినపత్రిక

# వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో జేడీఏ సునీత ఆకస్మిక తనిఖీ

## విభాగాల పనితీరు, రైతు సేవలపై ఆరా

తాడేపల్లిగూడెం ప్రతినిధి, సెప్టెంబరు 10 (ప్రజా వీక్షణం)

పశ్చిమగోదావరి జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జి.సునీత గురువారం తాడేపల్లిగూడెం పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయాలను సందర్శించి, ఆయా విభాగాల పనితీరును పరిశీలించారు. స్థానిక హౌసింగ్ బోర్డు సెంటర్‌లో ఉన్న అగ్రికల్చర్ ఆఫీస్ కాంపౌండ్‌లోని సబ్‌డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయం, మండల వ్యవసాయ అధికారి కార్యాలయాలను జేడీఏ సునీత సందర్శించారు. కార్యాలయాల్లో కొనసాగుతున్న కార్యకలాపాలు, రైతులకు అందుతున్న సేవల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదే ప్రాంగణంలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల విభాగాలు, భూసార పరీక్ష కేంద్రం, ప్రాంతీయ కోడింగ్ సెంటర్‌ను ఆమె పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షలు, రికార్డుల నిర్వహణ, రైతులకు అందుతున్న సేవలు తదితర అంశాలపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన సేవలు రైతులకు మరింత సమర్థవంతంగా అందేలా వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జేడీఏ సూచించారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు మండల వ్యవసాయ అధికారి చీర్ల రవికుమార్, టెస్టింగ్ ల్యాబ్‌ల సహాయ వ్యవసాయ సంచాలకులు భాస్కరరావు, వి. హేమకుమారి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# బీ ఏ, బీ కాం మరియు బీ ఎస్సీ డిగ్రీ కోర్సులలో అడ్మిషన్ పొందడానికి గడువు పొడగింపు..

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 10 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ డా బీ ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ 051 గవర్నమెంట్ డిగ్రీ కళాశాల కాగజ్ నగర్ డా బీ ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల 051 కాగజ్ నగర్ లో ఇంటర్ పాస్ అయిన లేదా తత్సమాన అర్హత కలిగిన వారికి బీ ఏ, బీ కాం మరియు బీ ఎస్సీ డిగ్రీ కోర్సులలో www.braou online.ac.in ద్వారా ఆన్ లైన్ అడ్మిషన్ పొందడానికి చివరి తేదీని ఈ నెల అనగా సెప్టెంబర్ 30 వరకు పొడిగించినట్టు ఈ మేరకు యూనివర్సిటీ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ Ms K. శ్రీదేవి, మరియు కోఆర్డినేటర్ తూడూరు దత్తాత్రేయ తెలియ చేశారు. అలాగే 2 వ మరియు 3 వ సంవత్సర విద్యార్థులు తమ తమ ట్యూషన్ ఫీజులను కూడా పైన పేర్కొన్న తేదీ లోగా చెల్లించాలని వారు సూచించారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ 9160144943, లేదా 9494314314 లేదా 9866398678 లను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశం ను విద్యార్థులు ఉపయోగించు కావాలని కోరారు.



# మధుయాష్కి గౌడ్ ను సన్మానించిన శ్రీనివాసులు..

దేవరకద్ర సెప్టెంబర్ 10 ప్రజా వీక్షణం

ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ కమిటీ చైర్ పర్సన్ గా ఎన్నికైన మధు యాష్కీ గౌడ్ ను గురువారము అసెంబ్లీ ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఓబిసి ఉపాధ్యక్షులు గద్వాల జిల్లా అబ్జర్వర్ రాజమూరి శ్రీనివాసులు, మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మాని ంచారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, నూతన బాధ్యతల్లో విజయవంతంగా కొనసా గాలని ఆయన ఆకాంక్షించారు.



# వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల్లో మౌలిక వసతులు బలోపేతం చేయాలి.

## రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించాలి.

## వ్యవసాయ రంగం మరియు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అసెంబ్లీలో మాట్లాడిన.. ఎమ్మెల్యే జియంఆర్

దేవరకద్ర. సెప్టెంబర్ 10 ప్రజా విక్షణం

రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధికి నాణ్యమైన వ్యవసాయ విద్య, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరమని పేర్కొన్నారు, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలల్లో మౌలిక వసతులు, ఆధునిక ప్రయోగశాలలు (ల్యాబ్స్), అధ్యాపకుల కొరత వంటి సమస్యలనుపరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, గురువారం అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్రంలో అత్యధిక కుటుంబాలకు వ్యవసాయమే ప్రధాన ఆదాయ వనరుగా ఉందని, అయినప్పటికీ ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు పూర్తిస్థాయి అవగాహన లేకపోవడం వల్ల ఆశించిన దిగుబడి, ఆదాయం లభించడం లేదని పేర్కొన్నారు. ఇందుకు సరైన మౌలిక సదుపాయాలు, శాస్త్రవేత్తల మార్గదర్శకత్వం, క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమాలు మరింత అవసరమన్నారు.వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నప్పటికీ అనేక చోట్ల సరైన మౌలిక వసతులు, అధ్యాపకులు లేక విద్యా ప్రమాణాలు ప్రభావితమవుతున్నాయని తెలిపారు, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను గుర్తించి రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలని సంబంధిత మంత్రి ని కోరారు.వ్యవసాయం పూర్తిగా క్షేత్రస్థాయి అనుభవం, పరిశోధనలపై ఆధారపడి ఉంటుందని, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండేలా ఫీల్డ్ విజిట్లను పెంచాలనిఆయన సూచించారు. వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యను కేవలం తరగతి గదులకే పరిమితం చేయకుండా పంటల సాగు, మట్టి పరీక్షలు, నాణ్యమైన విత్తనాల ఎంపిక, డ్రిప్ ఇరిగేషన్, ఆధునిక వ్యవసాయ సాంకేతికతపై విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ అందించాలని కోరారు.అదేవిధంగా ఆధునిక వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రికల్చర్ ప్రాసెసింగ్, స్మార్ట్ ఫార్మింగ్, ఆర్గానిక్ ఫార్మింగ్ వంటి నూతన అంశాలను కోర్సుల్లో చేర్చాల్సిన అవసరం ఉందనిఆయన తెలియజేశారు.అదేవిధంగా ఇటీవల దేవరకద్ర నియోజకవర్గం లోని



భూత్పూర్ మండలం షేర్‌పల్లి గ్రామంలో కూరగాయల సాగుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించారు. షేర్‌పల్లి గ్రామంలో సుమారు 250 ఎకరాల్లో ఆధునిక పద్ధతుల్లో కూరగాయల సాగు జరుగుతోందని, ఈ విధానాలను ఇతర గ్రామాల రైతులకు కూడా పరిచయం చేయాలనే ఉద్దేశంతో నియోజకవర్గ సర్పంచ్ లను, రైతులను అందరిని ఆహ్వానించి వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో కలిసి తాము వర్క్‌షాప్ నిర్వహించినట్లుఆయన తెలిపారు. కూరగాయల సాగుకు ప్రభుత్వం అందిస్తున్నప్రోత్సాహకాలను రైతులు పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. జీడిమెట్లలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారానాణ్యమైన కూరగాయల నారును అందిస్తున్నప్పటికీ, దాని గురించి రైతుల్లో తగినంత అవగాహన లేకపోవడం వల్ల ప్రయోజనాలు పూర్తిగా అందడం లేదనిఆయన తెలిపారు.రైతులకు ప్రభు త్వం, శాస్త్రవేత్తలు అందిస్తున్న సాంకేతిక సహకారం క్షేత్రస్థాయికి చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.ముఖ్యంగా దేవరకద్ర నియోజకవర్గంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని దేవరకద్రలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తిఆయన చేశారు. వ్యవసాయ విద్యపై విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోందని, నియోజకవర్గంలో వ్యవసాయ ఆధారిత కుటుంబాలు అధిక ంగా ఉన్న నేపథ్యంలో ఇక్కడ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేస్తే విద్యార్థులతో పాటు రైతులకు కూడా ఎంతో ప్రయోజనంచేకూరుతుందనిఆయన తెలిపారు.వ్యవసాయ రంగాన్నిఆధునికీకరించడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు నాణ్యమైన వ్యవసాయ విద్య కీలకమని, అందుకు అనుగుణంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలను మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, కోరారు.

# చిన్న రాజమూరు గ్రామంలో అక్రమ ఇసుక రవాణా.. అడ్డుకున్న గ్రామస్తులు..

## బారస.. అధికార పార్టీ నాయకుల మధ్య తోపులాట..

దేవరకద్ర సెప్టెంబర్ 10 ప్రజా విక్షణం



మండల పరిధిలోని చిన్న రాజమూరు గ్రామంలో గురువారం రాత్రి వాగులో నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా దీన్ని గమనించిన గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ విషయమై బారాస అధికార పార్టీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. అక్రమ ఇసుక రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోయిందని ప్రజలు అన్నారు. అక్రమ ఇసుక రమణ చేయడం వల్ల భూగర్భ జలాలు పూర్తిగా ఎండిపోతున్నాయని దాని వలన చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ బోర్లు కూడా పనిచేయడం లేదని రైతులు అంటున్నారు. అక్రమ ఇసుక రవాణా గురించి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా కూడా ఎవరు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. ఇప్పటికైనా మైనింగ్ అధికారులు శ్రద్ధ తీసుకొని అక్రమ ఇసుక రవాణకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు.

# నేటి నుండి భాద్రపద మాసం ప్రారంభం

## -దేవతా పూజలకు, పితృదేవతల పూజకు కూడా ఉత్కృష్టమైన మాసం భాద్రపద మాసం - చాంద్రమానం ప్రకారం భాద్రపద మాసం ఆరవమాసం

దేవతా పూజలకు, పితృదేవతల పూజకు కూడా ఉత్కృష్టమైన మాసం 'భాద్రపద మాసం'చాంద్రమానం ప్రకరం భాద్రపద మాసం ఆరవమాసం. ఈ మాసంలోని పూర్ణిమ తిథినాడు చంద్రుడు పూర్వాభాద్ర నక్షత్రం సమీపంలోగాని, ఉత్తరాభాద్ర నక్షత్రం సమీపంలోగానీ ఉండడంవల్ల ఈ మాసానికి 'భాద్రపద మాసం' అనే పేరు ఏర్పడింది.ఈ మాసం లో ఒంటి పూట భోజనం చేస్తే ధన సమృద్ధి ఆరోగ్యం ప్రాప్తిస్తాయి. ఉప్పు మరియు బెల్లం దానాలు కూడా ఈ మాసం లో విశేష ఫలితాన్నిస్తాయని పండితులు పేర్కొంటున్నారు. కొన్ని ప్రదేశాలలో స్త్రీలు భాద్రపద శుక్ల తదియ రోజున హరితాళిక వ్రతం ఆచరిస్తారు. ఈ వ్రతాన్ని ఆచరించి, ఉపవాసం జాగరణ చేస్తారు. ఈ వ్రతాన్ని భక్తి శ్రద్దలతో ఆచరిస్తే కష్టాలు తొలగి, అష్టైశ్వర్యాలతో తులతూగుతారు.భాద్రపద శుద్ధ చవితి నాడు ఆది దేవుడైన వినాయక ఆవిర్భావం జరిగిన రోజు, ఈ రోజున గణపతి పూజ ఉపవాసం వంటివి విశేష ఫలితాన్నిస్తాయి. ఈ పండుగ ఆదివారం రోజు కాని, మంగళవారం రోజు కాని రావడం మరింత విశేషాన్ని సంతరించుకొంటుంది. భాద్రపద శుద్ధ పంచమి నాడు ఋషి పంచమి జరుపుకొంటారు. ఇది కేవలం ఆడవారికి సంబంధించిన ప్రాయోశ్చితాత్మకమైన వ్రతం. ఈ వ్రతం చేయడం వలన స్త్రీలు ఋతుశ్రావ సమయం లో చేసిన పాపాలన్నీ తొలగి పుణ్య ఫలితం లభిస్తుంది అని భవిష్యపురాణం లో చెప్పబడింది. ఈ వ్రతం లో ముఖ్యంగా ఆచరించవలసినది, బ్రహ్మాహణుడికి అరటి పళ్ళు, నెయ్యి, పంచదార, దక్షిణ ఇవ్వాలి. ఒంటి పూట భోజనం చేయాలి. అంతే గాక ఆ భోజనం ధాన్యం, పాలు, పెరుగు, ఉప్పు, పంచాదారలతో తయారుచేయకుండా ఉండాలి. పళ్ళని స్వీకరించడం శ్రేయస్కరం.బౌద్ధ జయంతి ని కూడా ఈ రోజునే జరుపుకొంటారు. బుద్ధని భోధనలు మానవుని ధర్మబద్ధమైన, పవిత్రమైన జీవనానికి వెలుగు బాట వేసాయి. ప్రపంచం లోని ధర్మమతస్తాపనకు బుద్ధుడు అత్యున్నత స్థానం వహించాడనే విషయంలో ఏమాత్రం భేదాభిప్రాయాలు లేవు.భాద్రపద శుద్ధ షష్ఠి /సూర్య షష్ఠి, సప్తమి కలసిన షష్ఠి సూర్యునికి ప్రీతికరం, ఈరోజున సూర్యుడిని ఆవుపాలు, పెరుగు, నెయ్యి, గోమయం, గోమూత్రం తో ప్రాశనం చేస్తే అశ్వమేధ యాగం చేసిన ఫలం కంటే ఎక్కువ ఫలం కలుగుతుందని శాస్త్రం లో చెప్పబడింది. షష్ఠి తో కూడిన సప్తమి ఉంటే కనుక సుబ్రహ్మణ్య స్వామి ని పూజిస్తే ఎటువంటి పాతకాలైన నశిస్తాయి.భాద్రపద శుద్ధ అష్టమి నాడు కేదారవ్రతాన్ని ఆచరిస్తారు. ఈ వ్రతాన్ని సంప్రదాయ సిద్దం గా ఆచరిస్తుంటారు. భాద్రపద శుద్ధ దశమి నాడు దశావతార వ్రతం ఆచరించడం, దేవ, ఋషి, పితరులకు తర్పణాలు చేయడం ముఖ్యమైన విధులు. భాద్రపద శుద్ధ ఏకాదశి, దీన్నే పద్మ పరివర్తన ఏకాదశి అని కూడా అంటారు. తొలి ఏకాదశి రోజున పాల సముద్రం లో శేషతల్పం పై శయనించిన శ్రీమహావిష్ణువు, ఈ ఏకాదశి రోజున ప్రక్కకు పొర్లి పరివర్తనం చెందుతాడు, అందుకే దీన్ని పరివర్తన ఏకాదశి అంటారు ఈ ఏకాదశి వ్రతాన్ని ఆచరిస్తే కరువు కాటకాలు




తొలగి పోతాయి, ముఖ్యం గా సంధ్యాసమయం లో శ్రీ మహా విష్ణువు ని పూజిస్తే మంచి ఫలితాలు కలుగుతాయి. భాద్రపద శుద్ధ ద్వాదశి వామన జయంతి గా చెప్పబడింది, ఈ రోజున వామనున్ని ఆరాదిస్తే అన్ని విషయాలలోనూ విజయం లభిస్తుంది. ముఖ్యంగా ఈ రోజున బ్రాహ్మణులకు పెరుగును దానం చేస్తే మంచి ఫలితాలని పొందవచ్చు.భాద్రపద మాసం లో శుద్ద చతుర్దశి నాడు అనంత పద్మనాభ చతుర్దశి అంటారు. శేషతల్పసాయిగా నాభికమలం తో శ్రీమహాలక్ష్మి సమేతుడైన శ్రీమహావిష్ణువు ని పూజించి, వ్రతమాచరిస్తే దారిద్ర భాధలు తొలగి ఐశ్వర్య ప్రాప్తి కలుగుతుంది.భాద్రపద పూర్ణిమ రోజు ఉమామహేశ్వర వ్రతం జరుపుకొంటారు, భక్తి శ్రద్దలతో ఈ వ్రతాన్ని ఆచరిస్తే సుఖశాంతులతో పాటు అష్టైశ్వర్యాలు ప్రాప్తిస్తాయి.భాద్రపద పూర్ణిమ తో మహాలయపక్షం ఆరంభమవుతుంది, అమావాస్య వరకు గల ఈ కాలాన్ని పితృ పక్షం అని కూడా అంటారు. మృతులైన పితరులకు, పూర్వీకులకు తప్పనిసరిగా తర్పణలివ్వాలి. శ్రాద్దాన్ని యధాశక్తి గా ఈ దినాలలో చేయాలి.భాద్రపద బహుళ తదియ ని ఉండ్రాళ్ళ తద్దేగా చెప్పబడింది. ఇది స్త్రీలు చేసుకొనే పండుగ, ముఖ్యంగా కన్నె పిల్లలు గౌరీ దేవిని పూజించి, ఉండ్రాళ్ళను నివేదిస్తే మంచి భర్త వస్తాడని చెప్పబడింది. స్త్రీలకు అయిదవతనం వృద్ధి చెందుతుంది.భాద్రపద కృష్ణ ఏకాదశి అజ ఏకాదశి దీన్ని ధర్మప్రభ ఏకాదశి అని కూడా అంటారు. ఈ రోజు ఏకాదశి వ్రతమాచరించి నూనె గింజలను దానం చేస్తే విశేష ఫలితాన్ని పొందవచ్చు.భాద్రపద కృష్ణ అమావాస్య మహాలయమావాస్య, ఈ రోజున పితృ తర్పణాలు, దానధర్మాలు చేయడం ఆచారం.




## 13 ఏండ్ల తర్వాత.. దులీప్ ట్రోఫీ..

# ఈస్ట్ జోన్ కైవసం

చెన్నై : దేశవాళీలో ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీని 13 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈస్ట్‌జోన్ దక్కించుకుంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఆట నాలుగో రోజే విజయం ఖాయమైన నేపథ్యంలో గురువారం ఆఖరి రోజు బ్యాటింగ్‌కు వచ్చిన ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌ను 388/7 వద్ద డిక్లేర్ చేసింది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 372 పరుగుల ఆధిక్యం దక్కించుకున్న ఆ జట్టు ఓవరాల్‌గా 760 రన్స్ లీడ్ సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 212/5తో ఐదో రోజు బ్యాటింగ్ చేసిన ఈస్ట్‌జోన్‌కు లోయరార్డర్‌లో ఖురేషి (116 నాటౌట్), అనుకుల్ రాయ్ (64) మెరుగ్గా ఆడి ఆధిక్యాన్ని మరింత పెంచారు.లంచ్ విరామం తర్వాత 20 ఓవర్లు ఆడిన ఆ జట్టు అనుకుల్ నిష్క్రమణ తర్వాత ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో సౌత్ జోన్ రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు రాలేదు. దీంతో మ్యాచ్ డ్రా గా ముగిసినట్టు నిర్వాహకులు ప్రకటించారు. తద్వారా 2012-13 సీజన్ తర్వాత ఈస్ట్‌జోన్ ఖాతాలో మరో దులీప్ ట్రోఫీ టైటిల్ చేరింది. ఫైనల్‌లో అద్భుతంగా ఆడిన ఇషాన్‌ను 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', సౌత్‌జోన్ సారథి తిలక్ వర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులు దక్కాయి.




# వైట్‌వాష్ దిశగా పాక్!

ఎడ్జ్‌బాస్టన్ : ఇంగ్లండ్ పర్యటనలో ఇప్పటికే రెండు టెస్టుల్లో ఓడి సిరీస్ కోల్పోయిన పాకిస్థాన్.. ఎడ్జ్‌బాస్టన్‌లో జరుగుతున్న మూడో టెస్టులోనూ ఓటమి దిశగా సాగుతోంది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఇంగ్లిష్ బౌలర్ల ధాటికి 133 రన్స్‌కే ఆలౌట్ అయిన బాబర్ సేన.. ప్రత్యర్థికి భారీ ఆధిక్యాన్ని సమర్పించుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 453 పరుగుల భారీ స్కోరు చేసింది.టాపార్డర్ విఫలమైనా హ్యారీ బ్రూక్ (75)తో పాటు జెమీ స్మిత్ (69), లారెన్స్ (65), ఒలీ రాబిన్సన్ (50), జోఫ్రా ఆర్చర్ (32 నాటౌట్) రాణించడంతో ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 320 పరుగుల భారీ ఆధిక్యాన్ని దక్కించుకుంది. రెండో ఇన్నింగ్స్‌కు వచ్చిన పాక్.. రాబిన్సన్ మొదటి ఓవర్లోనే సయిమ్ అయూబ్, అబ్దుల్లా షఫీక్ వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. మూడో రోజు వర్షం వల్ల ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 52/2 చేసింది.



## వరల్డ్‌కప్ చాలా దూరంలో ఉంది.. అప్పుడు చూసుకుందాంలే..!

వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ( ఆడడంపై అనిశ్చితికి తెరపడడం లేదు. లార్డ్స్ వన్డేలో శతకంతో మెరిసినా ఈ మాజీ కెప్టెన్‌కు స్క్వాడ్‌లో చోటు దక్కుతుందన్న గ్యారంటీ లేదు. ఇప్పటికిప్పుడు వేటు పడకున్నా.. మెగా ఈవెంట్‌లో హిట్‌మ్యాన్ ఉంటాడా? లేదా? అనే సందేహం మాత్రం అభిమానులను వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో తన భవితవ్యం గురించి, వరల్డ్‌కప్ సన్నద్ధత గురించి రోహిత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వచ్చే ఏడాది అక్టోబర్‌కు చాలా సమయం ఉందని కూల్‌గా పేర్కొన్నాడీ డాషింగ్ ఓపెనర్.కెరీర్ చరమాంకంలో ఉన్న భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ వన్డే వరల్డ్‌కప్ స్క్వాడ్‌లో ఉంటాడా? లేదా? అనేది ఉత్కంఠ రేపుతోంది. 50 ఓవర్ల ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్న రోహిత్ చివరి ప్రపంచకప్ ఆడాలనుకుంటున్నా.. సెలెక్టర్లు మాత్రం భరోసా ఇవ్వడం లేదు. ఈ పరిస్థితుల్లో హిట్‌మ్యాన్ ఏమాత్రం ఆందోళనకు గురవ్వట్లేదు. ప్రపంచకప్ సన్నద్ధత గురించి మాట్లాడిన అతడు వచ్చే ఏడాది అక్టోబర్ చాలా దూరం ఉంది. తొందర ఎందుకు అప్పుడు చూసుకుందాంలే అని తాపీగా చెప్పేశాడు. అంతేకాదు.. 2024లో టీ20 వరల్డ్‌కప్ విజయోత్సవంలో మాదిరిగా వన్డే ప్రపంచకప్ గెలిచాక బస్సు యాత్ర ఉండకపోవచ్చని రోహిత్ అన్నాడు. దాంతో.. తాను భారత స్క్వాడ్‌లో ఉండడం ఖాయమనే నమ్మకంతో ఉన్నాడీ సిక్సర్ల వీరుడు.దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వేలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న వన్డే ప్రపంచకప్ సమయానికి రోహిత్‌కు 40 ఏళ్లు వస్తాయి. దాంతో.. అతడిని ఓపెనర్‌గా ఆడించడం కంటే యువకుడైన యశస్వీ జైస్వాల్ బెటర్ అని సెలెక్టర్లు అనుకుంటున్నారు. కానీ, మాజీ క్రికెటర్లు మాత్రం అనుభవజ్ఞుడైన రోహిత్‌ను ఆడించాలని అభిప్రాయపడుతున్నారు. బీసీసీఐ సమీక్షా సమావేశం అనంతరం సెక్రటరీ దేవజిత్ సైకియా మాట్లాడుతూ హిట్‌మ్యాన్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'మీరు చూసే ఉంటారు. రోహిత్ గొప్పగా ఆడుతున్నాడు. మీకు ఇంకేం కావాలి. అతడి గురించి వస్తున్న వదంతులను నమ్మకండి ' అని సైకియా కామెంట్ చేశాడు. దాంతో.. ప్రస్తుతానికి వన్డే జట్టులో రోహిత్‌కు అవకాశముందనే విషయాన్ని చెప్పకనే చెప్పాడు బీసీసీఐ కార్యదర్శి. ఈ సమావేశంలో ఓపెనర్‌గా యశస్వీకి అవకాశం ఇవ్వాలని చీఫ్ సెలెక్టర్ అగార్కర్, కోచ్ గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అభిప్రాయపడగా.. తాత్కాలిక కోచ్ వీవీఎస్ లక్ష్మణ్, టీ20 సారథి శ్రేయాస్ అయ్యర్‌లు మాత్రం రోహిత్ ఉండాల్సిందేనని పట్టుపట్టారని సమాచారం. ఎలాగైనా ప్రపంచకప్ స్క్వాడ్‌లో ఉండాలనే లక్ష్యంతో సాగుతున్న రోహిత్ స్వదేశంలో వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌కు సన్నద్ధమవుతున్నాడు.

## భారత్, అఫ్గనిస్థాన్ తొలి టీ20 వాయిదా..

# షెడ్యూల్‌లో మార్పులకు కారణమిదే..!



మరో మూడు రోజుల్లో భారత్, అఫ్గనిస్థాన్ మధ్య టీ20 సిరీస్ మొదలు కానుంది. షెడ్యూల్ ప్రకారం స్వదేశంలో సెప్టెంబర్ 13వ తేదీన మొదటి మ్యాచ్ జరగాలి. ఇప్పటికే సన్నాహకాల్లో మునిగిపోయిన ఇరుజట్ల ఆటగాళ్లకు షాకింగ్ న్యూస్ ఏంటంటే.. షెడ్యూల్ మారనుంది. భద్రతా కారణాలరీత్యా తొలి టీ20ని వాయిదా వేయాలని ఢిల్లీ, డిస్ట్రిక్ క్రికెట్ సంఘాని ట్రాఫిక్ పోలీసులు లేఖ రాశారు. దాంతో.. మొదటి మ్యాచ్ నిర్వహణపై బీసీసీఐ, ఏసీబీ నిర్ణయం తీసుకోనున్నాయి .క్యాలెండర్‌లు ఎంచుకోండిశ్రీలంక పర్యటనలో సిరీస్ విజయంతో జోరుమీదున్న టీమిండియా స్వదేశంలో అఫ్గనిస్థాన్‌ను ఢీకొట్టనుంది. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 13 నుంచి ఇరుజట్ల మధ్య టీ20 సిరీస్ షురూ కావాలి. కానీ, భద్రతా కారణాలరీత్యా షెడ్యూల్‌లో మార్పులు అనివార్యమనిపిస్తోంది. క్రిక్‌బజ్ కథనం ప్రకారం.. దేశ రాజధానిలో సెప్టెంబర్ 12-13 తేదీల్లో బ్రిక్స్ సమావేశాలు జరుగనున్నాయి. ఈ సమావేశాల రెండో రోజే తొలి టీ20 ఉంది. దాంతో, మ్యాచ్‌ను వాయిదా వేసుకోవాలని గురువారం ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు ఢిల్లీ క్రికెట్ సంఘానికి లేఖ రాశారు.ఒకరోజు వాయిదా భారత్, అఫ్గనిస్థాన్ మధ్య ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో తొలి టీ20 మ్యాచ్ జరగాలి. అయితే.. రాజధానిలో బ్రిక్స్ సదస్సు నిర్వహిస్తున్నందున బందోబస్తులో పోలీసులు బిజీగా ఉండనున్నారు. ఈ పరిస్థితుల్లో స్టేడియం వద్ద భద్రతా ఏర్పాట్లు చూసేందుకు సిబ్బంది కొరత ఉండనుంది. అందుకని మ్యాచ్‌ను ఒకరోజుకు వాయిదా వేయాలని ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు ఢిల్లీ, డిస్ట్రిక్ క్రికెట్ సంఘానికి లేఖ రాశారు. అయితే.. డీడీసీఏ మాత్రం.. అంతర్జాతీయ టీ20 కావున తమ పరిధిలో ఉండదని.. ఒకవేళ తేదీలో ఏదైనా మార్పులు చేస్తే తెలియజేస్తామని పోలీసులకు తెలిపింది. పోలీసుల అభ్యర్థన నేపథ్యంలో సెప్టెంబర్ 13, ఆదివారం జరగాల్సిన మ్యాచ్‌ను సెప్టెంబర్ 14, సోమవారం ఆడించే అవకాశముంది. అయితే.. బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌లుఫిట్‌నెస్ సాధించడంతో వైట్‌వాష్‌పై టీమిండియా దృష్టి సారించనుంది.

## 13 ఏళ్ల తర్వాత దులీప్ ట్రోఫీ గెలుచుకున్న ఈస్ట్ జోన్

చెన్నై: ఈస్ట్ జోన్ జట్టు దులీప్ ట్రోఫీగెలుచుకున్నది. 13 ఏళ్ల తర్వాత ఆ జట్టుకు ట్రోఫీ దక్కింది. సౌత్ జోన్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో.. ఫస్ట్ ఇన్నింగ్స్ లీడ్ ద్వారా ఈస్ట్ జోన్‌ను విజయం వరించింది. ఇవాళ అయిదో రోజు తన రెండో ఇన్నింగ్స్‌లో ఈస్ట్ జోన్ ఏడు వికెట్ల నష్టానికి 388 రన్స్ చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. దీంతో ఆ జట్టు 760 పరుగుల ఆధిక్యం సాధించింది. అయితే ఇద్దరు కెప్టెన్లు డ్రాకు అంగీకరించడంతో దులీప్ ట్రోఫీ ఈస్ట్‌జోన్ సొంతం చేసుకున్నది. రెండో ఇన్నింగ్స్‌లో ఈస్ట్ జోన్ బ్యాటర్ మొహమ్మద్ కౌనియన్ ఖురేషి సెంచరీ చేశాడు. 116 రన్స్‌తో అతను నాటౌట్‌గా నిలిచాడు.అయిదో రోజు 5 వికెట్లకు 212 రన్స్ వద్ద ఆట ప్రారంభించిన ఈస్ట్ జోన్.. చాలా స్వేచ్ఛగా బ్యాటింగ్ కొనసాగించింది. సౌత్ జోన్ బౌలర్లు పెద్దగా వత్తిడి పెంచలేకపోయారు. సిరాజ్‌కు సపోర్టు లేకపోవడంతో ఈస్ట్ జోన్ ఈజీగా పరుగులు రాబట్టింది. ఈ మ్యాచ్‌లో పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది ఈస్ట్ జోన్. తొలి ఇన్నింగ్స్‌లో 708 రన్స్ చేసిన ఆ జట్టు, రెండో ఇన్నింగ్స్‌లోనూ ధాటిగా ఆడింది. ఇక సౌత్ జోన్ తన ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 336 రన్స్‌కే ఆలౌట్ అయ్యింది.ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ తన తొలి ఇన్నింగ్స్‌లో 270, రెండో ఇన్నింగ్స్‌లో 80 రన్స్ చేశాడు. రెండు ఇన్నింగ్స్‌లో కలిపి అతను 350 రన్స్ చేసి దులీప్ ట్రోఫీ ఫైనల్లో కొత్త రికార్డు నెలకొల్పాడు. అతని ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 99 రన్స్ చేసిన సౌత్ జోన్ కెప్టెన్ తిలక్ వర్మకు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డు దక్కింది. దులీప్ ట్రోఫీ టైటిల్‌ను ఈస్ట్ జోన్ గెలవడం ఇది మూడోసారి.

## హర్షిత్ రాణా స్థానంలో యశ్ థాకూర్.. ఆఫ్ఘన్‌తో సిరీస్‌కు బుమ్రా ఫిట్

ముంబై: ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగే టీ20 సిరీస్(౨20 ాావతీఅవం)తో పాటు ఆసియా క్రీడలకు చెందిన టీ20 జట్టుకు బౌలర్ యశ్ థాకూర్(ఖంష్ట్ర ౨ష్ఘుఎబతీ)ను తీసుకున్నారు. గాయపడ్డ హర్షిత్ రాణా స్థానంలో యశ్ థాకూర్‌ను ఎంపిక చేశారు. ఆఫ్ఘనిస్తాన్‌తో ఇండియా మూడు టీ20లు ఆడనున్న విషయం తెలిసిందే. హర్షిత్ రాణా ప్రస్తుతం బెంగుళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోలుకుంటున్నాడు. ఇక విదర్భకు చెందిన 27 ఏళ్ల యశ్ థాకూర్ ఇటీవల జింబాబ్వేతో జరిగిన టూర్‌లో బౌలింగ్ చేసిన విషయం తెలిసిందే. రెండు మ్యాచుల్లో అతను 4 వికెట్లు తీసుకున్నాడు. 50 సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ మ్యాచుల్లో ఆడాడు. వాటిల్లో 81 వికెట్లు తీసుకున్నాడు.ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాకు క్లియరెన్స్ దక్కింది. ఆఫ్ఘన్‌తో జరిగే టీ20 సిరీస్‌లో అతను ఆడనున్నాడు. బుమ్రా ఫిట్‌గా ఉన్నట్లు బోర్డు చెప్పింది. ఫిట్‌నెస్ ఉంటేనే ఆఫ్ఘన్‌తో సిరీస్‌కు క్లియరెన్స్ ఇవ్వనున్నట్లు గతంలో బోర్డు పేర్కొన్న విషయం తెలిసిందే. బుమ్రాతో పాటు నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్‌కు కూడా క్లియరెన్స్ దక్కింది. జూలైలో ఇంగ్లండ్‌తో జరిగిన మూడో వన్డేకు బుమ్రా దూరం అయ్యాడు. ఆ తర్వాత శ్రీలంకలో జరిగిన రెండు టెస్టులకు కూడా అతను దూరంగా ఉన్నాడు. సెప్టెంబర్ 13 నుంచి ఆఫ్ఘన్‌తో టీ20 సిరీస్ ప్రారంభంకానున్నది.

ప్రజావీక్షణం
దినపత్రిక



# ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ మూవీ మండాడి

సూరి, సుహాస్ మెయిన్ లీడ్స్ గా తెరకెక్కిన తమిళ్ సినిమా 'మండాడి'. ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్ పై ఎల్రెడ్ కుమార్ నిర్మాణంలో మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. ఈ సినిమాలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటించగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్.. పలువురు కీలక పాత్రలను పోషించారు. మండాడి సినిమా నేడు సెప్టెంబర్ 10న తమిళ్, తెలుగులో రిలీజ్ అయింది. కళింగపట్నంను సట్టపులి(సుహాస్) రూల్ చేస్తూ ఉంటాడు. ఆ ఊళ్ళో సముద్రంలో జరిగే పడవపోటీలు ఎన్నో ఏళ్లుగా చాలా ఫేమస్. 20 ఏళ్లుగా సట్టపులి సునామి రైడర్స్ టీమ్ తో ఆ ఊరిని గెలిపిస్తూ ఉంటాడు. శ్రీను(రవీంద్ర విజయ్) కొడుకు మల్లేష్(మిథున్ జై శంకర్) పడవల పోటీకి సంబంధించిన ఓ విషయంలో గొడవ జరిగి సట్టపులి కొడుకుపై దాడి చేస్తాడు. అది మిస్ అవ్వడంతో ఓ అమ్మాయి సాయంతో హైదరాబాద్ లో ఉన్న ముత్తు కాళీ(సూరి) దగ్గర తలదాచుకుని ఉంటాడు. ముత్తుకాళీ పెళ్లి చేసుకోకుండా సింగిల్ గా ఉంటూ ఓ స్విమ్మింగ్ పూల్ లో పనిచేస్తూ ఉంటాడు. కానీ సట్టపులి మనుషులు మల్లేష్ ని చంపడానికి అక్కడికి కూడా రావడంతో 20 ఏళ్లుగా ఊరికి వెళ్లని ముత్తుకాళీ మల్లేష్ ని తీసుకొని ఊరికి వస్తాడు. అక్కడ పెద్దలు సట్టపులికి ముత్తుకాళీ మధ్య రాజి కుదర్చాలని ట్రై చేసినా అక్కడ పెద్ద గొడవ అవుతుంది. దాంతో కళింగపట్నం నుంచి రెండు టీమ్స్ పోటీ చేయాలి ఎవరు ఓడిపోతే వాళ్ళు ఆటని వదిలేయాలి అని నిర్ణయిస్తారు. పోటీకి కొన్ని రోజులు సమయం ఉండటంతో కొత్తవాళ్లకు ముత్తుకాళీ తన కళింగ వారియర్స్ టీమ్ గా ట్రైనింగ్ ఇస్తూ ఉంటాడు. సట్టపులి, అతని కొడుకు పోటీ ఎలాగైనా గెలవాలని కుట్రలు పన్నుతూ ఉంటారు. ఓ ప్రాక్టీస్ మ్యాచ్ లో ముత్తుకాళీ టీమ్ పడవ బోల్తా పడి పోటీలో ఉన్నవాళ్లు హాస్పిటల్ పాలవుతారు. దీంతో కళింగ వారియర్స్ కి పోటీల్లో ఎలా పాల్గొనాలో అర్థం కాదు. మరోవైపు 20 ఏళ్ళ క్రితం ముత్తుకాళీ ఒకప్పుడు తన తల్లి ఏంజిల్ (మహిమా నంబియార్)ని ప్రేమించిన వ్యక్తి అని తెలిసి మల్లేష్ ముత్తుకాళీ పై కోపంగా ఉంటాడు. అసలు 20 ఏళ్ళ క్రితం ఆ ఊళ్ళో ఏం జరిగింది? బెస్ట్ ఫ్రెండ్స్ గా ఉండే సట్టపులి -- ముత్తుకాళీ శత్రువులు ఎలా అయ్యారు? ఏంజిల్ -- ముత్తుకాళీ ప్రేమ ఎందుకు విఫలమైంది? పోటీలో గెలవడానికి సట్టపులి చేసే కుట్రలు ఏంటి? ఫైనల్ పోటీలో ముత్తుకాళీ టీమ్ గెలుస్తుందా? సముద్రంలో జరిగే సంఘటనలు ఏంటి.. ఇవన్నీ తెలియాలంటే తెరపై చూడాల్సిందే.



## సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన స్వగత కృష్ణన్

తమిళ సినీ పరిశ్రమలో ఓ పోస్ట్ చర్చనీయంగా మారింది. ప్రముఖ గాయని స్వగత కృష్ణన్ చేసిన తాజా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పేరు ప్రస్తావించకుండా ఓ వ్యక్తిపై ఆమె సంచలన ఆరోపణలు చేసింది. ఆ వ్యక్తి మహిళలపై లైంగిక దాడులు, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్, బలవంతపు మత మార్పిడి చేశాడని, అలాంటి వ్యక్తికి ఇండస్ట్రీ కి సపోర్టుగా నిలిచిందని అసంతృప్తి వ్యక్తం చేసింది.సింగర్ స్వగత కృష్ణన్ గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తనకు ఎదురైన చేదు అనుభవాలను వెల్లడించింది. ఓ సంగీత దర్శకుడి స్టూడియోలో తనను లైంగిక వేధించాడనీ, స్టూడియోలో సౌండ్‌ప్రూఫ్ గది, సీసీటీవీ కెమెరాలు ఉన్నాయని.. అక్కడ జరిగిన ఘటనను రికార్డు చేసి, ఆ ఫుటేజ్‌ను ఉపయోగించి తనను బెదిరించారని ఆమె పేర్కొన్నారు. తనకు మాత్రమే కాకుండా మరికొంతమంది మహిళలకు కూడా ఇదే వ్యక్తి వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయని స్వగత ఆరోపించారు. ఈ పరిణామాల కారణంగానే తాను చెన్నైని విడిచి రిషికేశ్‌కు వెళ్లినట్లు వెల్లడించారు. ఇప్పుడు స్వగత చేసిన తాజా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీతో ఆ వ్యవహారం మరోసారి చర్చలోకి వచ్చింది. పేరు చెప్పకుండా ఓ వ్యక్తిపై సంచలన ఆరోపణలు చేసింది. పలువురు బాధిత మహిళలు ఆరోపణలు చేసినప్పటికీ ఆ వ్యక్తికి సినీ పరిశ్రమలో మద్దతు లభిస్తుంది. ఆ వ్యక్తి ప్రస్తుతం తన సామాజిక ప్రతిష్ట, పీఆర్, ప్రజాభిప్రాయం గురించి ఇంటర్వ్యూలు ఇస్తుండటం ఎలా సాధ్యమవుతోందని ఆమె ప్రశ్నించారు. ఒకవైపు ఇలాంటి ఆరోపణలు ఉండగా.. మరోవైపు పరిశ్రమలో అతడికి గౌరవం, స్వాగతం లభిస్తుండటంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేసింది. స్వగత తాజా పోస్టులో మరో కీలక విషయాన్ని ప్రస్తావించింది. ఆ వ్యక్తి ప్రస్తుతం ఓ భక్తి ప్రధానమైన సినిమాకు సంగీతం అందిస్తున్నారని తెలిపింది. ఈ ఒక్క అంశం సోషల్ మీడియాలో చర్చకు మరింత ఆజ్యం పోసింది. అంతే కాదు.. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని బహిరంగ కార్యక్రమాలకు ఆహ్వానించడం, వేదికపై అతడికి కేక్ తినిపిస్తున్నారనీ తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో సినీ పరిశ్రమ ఎవరి పక్షాన నిలబడుతుందనీ ప్రశ్నించింది. ఇక చివరిలో 'నెక్స్ట్..' అంటూ తన ట్వీట్ ముగించింది సింగర్ స్వగత. ఇలాంటి ఉత్కంఠ రేపడంతో త్వరలో మరిన్ని వివరాలను వెల్లడించబోతున్నారా? ఇప్పటివరకు చెప్పని విషయాలను బయటపెట్టబోతున్నారా? అనే చర్చ మొదలైంది. ఇప్పటికే ఆమె గత ఆరోపణలపై కూడా సోషల్ మీడియాలో చర్చ జరిగిన నేపథ్యంలో.. తాజా పోస్టు మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా ఆమె తదుపరి పోస్టులో ఏదైనా వ్యక్తి పేరు లేదా కీలక ఆధారం బయటపెడతారా అన్నదే ఇప్పుడు ఉత్కంఠంగా మారింది.




## 'సీక్రెట్ సోల్జర్' నుంచి సాంగ్ రిలీజ్

నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా తెరకెక్కుతున్న సినిమా 'సీక్రెట్ సోల్జర్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై అక్కి విశ్వనాథ్ రెడ్డి దర్శకత్వంలో స్పై డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతుంది. కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్.. పలువురు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషించారు.ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజయిన సాంగ్స్, టీజర్, ట్రైలర్స్ అంచనాలు పెంచగా తాజాగా ఈ సినిమా నుంచి ఓయ్ ఓయ్.. అంటూ సాగే సాంగ్ ని రిలీజ్ చేశారు. కార్తీక్ రోడ్రిగ్జ్ సంగీత దర్శకత్వం అందిస్తూ రెహమాన్ రాసిన ఈ సాంగ్ ని కార్తీక్ స్వయంగా పాడాడు. ఈ సినిమా సెప్టెంబర్ 18న థియేటర్స్ లో రిలీజ్ కానుంది.



## అతన్ని ప్రేమించి మోసపోయా..

విలక్షణ నటిగా గుర్తింపు తెచ్చుకుని దక్షిణాదిలోని అన్ని భాషల్లో సత్తా చాటుతున్నారు ఐశ్వర్య లక్ష్మీ. నటనే కాదు ఏ విషయంపై అయినా కుండబద్ధలు కొట్టినట్లు మాట్లాడటం ఆమె స్టైల్. ఎవరు ఏమనుకున్నా సరే తన మనసులో ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతారు ఐశ్వర్య. కొద్దిరోజుల క్రితం పెళ్లి, సహజీవనం విషయంలో ఆమె మాట్లాడిన మాటలు హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా రిలేషన్‌పై ఐశ్వర్య చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. కేరళకు చెందిన ఐశ్వర్య లక్ష్మీ.. మెడిసిన్ చదువుకున్నారు. అయితే డాక్టర్ కాకుండా యాక్టింగ్ వైపు వచ్చారు. అప్పటికే మోడలింగ్ చేస్తూ పలు టాప్ బ్రాండ్స్‌కు సంబంధించిన వాణిజ్య ప్రకటనల్లో నటించారు. 2017లో నవిన్ పౌలే సరసన నటించే అవకాశం ఐశ్వర్యకు దక్కింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి గుర్తింపు రావడంతో పాటు మలయాళ, తమిళ భాషల్లో అనూహ్యంగా బిజీ అయ్యారు. మాయానంది, వారాతన్, పొన్నియన్ సెల్వన్, అమ్ము, కుమారి, గట్టా కుస్తీ, హలో మమ్మీ, మామన్ సినిమాలతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. సత్యదేవ్ హీరోగా వచ్చిన గాడ్సే మూవీ ద్వారా తెలుగు వారిని పలకరించారు ఐశ్వర్య లక్ష్మీ. ఈ ఏడాది తమిళంలో గట్టా కుస్తీ 2 సినిమాతో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం సాయిథరమ్ తేజ్ సరసన సంబరాల ఏటి గట్టు, మలయాళంలో ఆశా సినిమాలలో ఆమె నటిస్తున్నారు. సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే ఐశ్వర్య.. తన సినిమాలు, షూటింగ్స్, ఇతర వ్యక్తిగత వివరాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. 35 ఏళ్లు దాటి 40వైపు చేరుకుంటున్నా ఇంకా పెళ్లి చేసుకోకుండా బ్యాచిలర్‌గానే ఎంజాయ్ చేస్తున్నారు ఈ ముద్దుగుమ్మ. పలుమార్లు ఐశ్వర్య లక్ష్మీ ప్రేమలో పడినట్లుగా రూమర్స్ రాగా.. వాటిని ఆమె ఖండించారు. నేను సింగిల్‌గా చాలా హ్యాపీగా ఉన్నాను.. నన్ను డబుల్ చేసేందుకు ప్రయత్నించొద్దని ఫ్యాన్స్‌పై విరుచుకుపడింది ఐశ్వర్య. జీవితంలో నేను పెళ్లి చేసుకోను.. ఎంతోమంది సన్నిహితులను చాలా దగ్గరి నుంచి చూశా. పెళ్లి కారణంగా కలల్ని చంపుకుని, వ్యక్తిగతంగానూ వారు ఎదగలేకపోతున్నారు. ఇవన్నీ చూసి, ఆలోచించి జీవితంలో పెళ్లి చేసుకోకూడదని నిర్ణయించుకున్నాను. సంతోషకరమైన జీవితాన్ని గడపటానికి పెళ్లి అనేది తప్పనిసరి కాదు. పెళ్లి చేసుకుని విడిపోవడం కంటే, సహజీవనం బెస్ట్ అని ఐశ్వర్య లక్ష్మీ బోల్డ్ కామెంట్స్ చేశారు. తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పెళ్లి, ప్రేమపై ఐశ్వర్య లక్ష్మీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నేను గతంలో ఓ రిలేషన్‌లో మోసపోయా, స్వతహాగా నేను ఆకర్షణలకు లొంగను, అలాంటి ఓ వ్యక్తిని పూర్తి నమ్మి అతని చేతిలో మోసపోయా. ఈ రిలేషన్ ముగిసిన తర్వాతే నా చుట్టూ ఏం జరుగుతుందో తెలుస్తోంది. ఓ మహిళ నన్ను కలిసిన తర్వాతే అతని మోసం బయటపడింది. ఇందులో తన తప్పు లేకపోవడం వల్లే ఆమెపై నాకెలాంటి కోపం రాలేదు. ఈ విషయం గురించి రెండు రోజులు మాత్రమే బాధపడ్డా.. ఆ తర్వాత దానిని మరిచిపోయానని ఐశ్వర్య లక్ష్మీ పేర్కొన్నారు.

## స్టైల్‌ని బాగానే వాడేశారు

కంటెంట్ ఉన్నోడికి కటౌట్ చాలు.. ఈ సినిమా డైలాగ్‌ను సినిమాలకే ఆపాదిస్తే.. 'కంటెంట్ మీద నమ్మకం తక్కువ ఉన్నప్పుడు కాంట్రవర్సీ చాలు' అని మార్చొచ్చు. ఇది ఏ ఒకరినో ఉద్దేశించి అన్న మాట కాదు. ఇప్పటివరకు టాలీవుడ్‌లో జరిగిన సినిమా కాంట్రవర్శీలు, ఆ తర్వాత ఆ సినిమాలు పొందిన లాభాలు చూసి అన్నమాట ఇది. ఇక్కడ పేర్లు చెప్పం కానీ.. యువ హీరోలు.. యువ స్టార్ హీరోలు, యువ ప్రామిసింగ్ హీరోలుగా మారడానికి ఈ స్టైల్‌ని బాగానే వాడేశారు. ఇప్పుడు ఎందుకు ఈ చర్చ అనుకుంటున్నారా? ఇప్పుడు టాలీవుడ్‌లో రిలీజ్‌కి రెడీ అవుతున్న ఓ సినిమాకు సంబంధించి ఇదే మాట వినిపిస్తోంది. సమాజంలో చర్చని లేవనెత్తే సినిమా ఇది. ఎంతగా చర్చ జరిగితే మా సినిమాకి అంత మంచిది. ట్రైలర్ విడుదలైన వెంటనే మా సినిమాపై చర్చ మొదలైంది. అది మంచిదే. ఒక రకంగా ట్రైలర్‌తో మేం ప్రేక్షకుల్ని ముందుగానే సిద్ధం చేశాం అని హీరో ఆ సినిమా గురించి ఇటీవల మాట్లాడారు. ఈ మాటల వెనుక అర్థం డిస్కషన్ ఆ తర్వాత ఫుట్‌ఫాల్స్ అని అర్థమవుతోంది. ఇక ఆ సినిమా నిర్మాత అయితే.. సినిమాలో ప్రేక్షకులు ఊహించని విషయాలు, షాకులు మరిన్ని ఉంటాయనేలా మాట్లాడారు. ప్రేక్షకులను ముందే ప్రిపేర్ చేసే ప్రయత్నం ఇది అనిపిస్తోంది. ఈ సినిమాకు రెగ్యులర్ సినిమాల తరహా ముగింపు ఉండదని చెప్పిన నిర్మాత.. సినిమా ఉన్నట్లుండి, ఆగిపోయినట్లు అనిపిస్తుందని, ప్రేక్షకులు అనుకున్నట్లుగా క్లైమాక్స్ ఉండదని చెప్పారు. అలాగే కాస్త 'అతి' డైలాగ్‌లు అనిపించుకున్నవి సినిమాలో ఇంకా బాగుంటాయి అని కూడా చెప్పారు. ఈ సినిమాలోని సీన్స్, మాటలు ఇప్పటివరకు ఎక్కడా చూసి ఉండరని.. అంత సహజంగా తీశారని కూడా ఆ నిర్మాత చెబుతున్నారు. ఇదంతా చూస్తుంటే సినిమా విడుదల తర్వాత 'బేబీ' తరహా చర్చ, రచ్చ అయితే పక్కా అనిపిస్తోంది. మరి ఏమవుతుందో చూడాలి.




Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com